

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37.2	27.7
కావలి	36	28
ఆత్మకూరు	47	27
ఉదయగిరి	39	26
కందుకూరు	36	28



రేపటినుంచి సాఫ్ట్‌బాల్ టోర్నీ

వీఎస్‌యూలో మే 8వ తేదీ వరకు నిర్వహణ

దేశవ్యాప్తంగా 3వేల మందికిపైగా క్రీడాకారుల హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో (వీఎస్‌యూ) బుధవారం నుంచి మే 8వ తేదీ వరకు జరిగే అంతర యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆ వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత వెల్లడించారు. సోమవారం కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 94 మహిళా, 97 పురుషుల జట్లు పాల్గొంటాయని, ఒక్కో జట్టులో 16 మంది క్రీడాకారుల చొప్పున వారితో వచ్చే మేనేజర్లు, కోచ్‌లు కలిపి 3 వేల మందికిపైగా హాజరు కానున్నట్లు చెప్పారు. 40 మంది జాతీయ స్థాయి అంపైర్లను, రెఫరీలను టోర్నమెంట్ కోసం రప్పించినట్లు తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో 5 సాఫ్ట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి సాయంత్రం వరకు 35 మ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. ఇక తరలివచ్చే క్రీడాకారుల కోసం నెల్లూరులోని రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా వర్సిటీ ప్రాంగణానికి క్రీడాకారులను తీసుకురానున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు వసతి, సదుపాయాలను వర్సిటీలోని హాస్టల్ గదులలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సౌత్, నార్త్ ఇండియన్ ఫుడ్ స్టాళ్ల ఏర్పాటుతోపాటు నిరంతరం విద్యుత్, నీటి వసతి కోసం అధికారులతో చర్చించినట్లు చెప్పారు. టోర్నమెంట్ ప్రారంభం, ముగింపు వేడుకలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు వర్సిటీల వీసీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతమైతే జాతీయస్థాయిలో వీఎస్‌యూ ర్యాంకింగ్ మెరుగుపడేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పీఆర్‌వో డాక్టర్ కోట నీలమణికంఠ, టోర్నమెంట్ కమిటీ సభ్యులు పీ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏ ప్రవీణ్‌కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ వివరాలు వెల్లడిస్తున్న వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, తదితరులు

విధేయతకు 'సహకారం'!

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన సీనియర్ నాయకులు మెట్టుకూరు ధనంజయరెడ్డి, గంగోడు నాగేశ్వరరావులను కీలక పదవులతో ఆ పార్టీ అధిష్ఠానం సంతృప్తి పరిచింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా మెట్టుకూరు, జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నాగేశ్వరరావులను నియమించింది. ఈ రెండు నియామకాలతో టీడీపీ బలోపేతానికి సుదీర్ఘ కాలం పనిచేసిన ఇద్దరు నాయకులకు సముచిత పదవులు దక్కినట్లు అయ్యింది.





మెట్టుకూరు ధనంజయరెడ్డి రెండవ పర్యాయం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులయ్యారు. 2014-19లో టీడీపీ హయాంలో కూడా ఈయన డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతసాగరం మండలానికి చెందిన మెట్టుకూరు తొలి నుంచి ఆనం కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్నారు. అటు ఆత్మకూరు, ఇటు వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన బంధువర్గం కలిగిన మెట్టుకూరు ఆనం రామనారాయణరెడ్డి ముఖ్య అనుచరుడిగా రాజకీయాల్లో కొనసాగారు. 2019, ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అది దక్కకపోవడంతో మనస్తాపానికి గురై కొంతకాలం వైసీపీలో కొనసాగారు. మొన్నటి ఎన్నికల్లో ఉదయగిరి వైసీపీ టికెట్టు కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటికే ఆనం టీడీపీలో చేరడంతో ఈయన కూడా తిరిగి మాతృ పార్టీలో చేరిపోయారు. ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేశారు. సుదీర్ఘ కాలంగా ఈయన చేస్తున్న సేవలను గుర్తించి టీడీపీ అధిష్ఠానం రెండవ సారి డీసీసీబీ చైర్మన్‌గా నియమించింది.





ఇక డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన గంగోడు నాగేశ్వరరావు వెంకటగిరికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు. గతంలో ఈయన పెంచలకోన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పని చేశారు. టీడీపీ ముఖ్య నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎమ్మెల్యే టికెట్టు కోసం సైతం పలుసార్లు తీవ్రంగా ప్రయత్నించి, విఫలమయ్యారు. టీడీపీ బలోపేతానికి ఈయన చేసిన శ్రమను గుర్తించిన ఆ పార్టీ అధిష్ఠానం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా నియమించింది. జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు కీలక పదవులు దక్కడం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

\- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- డీసీసీబీ చైర్మన్‌గా 'మెట్టుకూరు'
- డీసీఎంఎస్ చైర్మన్‌గా 'గంగోటి'
- పార్టీలో కష్టపడినవారికి పట్టం కట్టిన అధినేత

అటు పీఎం.. ఇటు సీఎం..

భద్రత ఎలా!?

అమరావతికి తరలిన 300 మంది పోలీసులు

ఉన్నవారితో ముఖ్యమంత్రి బందోబస్తు సాధ్యమేనా!

పొరుగు జిల్లాల నుంచి రప్పించేందుకు ప్రయత్నాలు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనల నేపథ్యంలో వారి భద్రత జిల్లా పోలీసు అధికారులకు తలనొప్పిగా మారింది. మే 2వ తేదీన అమరావతికి ప్రధాని మోదీ వస్తుండగా జిల్లా నుంచి 10 మంది ఎస్‌ఐలు, 290 మంది సిబ్బందిని బందోబస్తు కోసం కేటాయించారు. ఈ మేరకు వీరంతా సోమవారం నగరంలోని పోలీసు కవాతు మైదానం నుంచి వాహనాల్లో అమరావతికి తరలివెళ్లారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే 1వ తేదీ గురువారం ఆత్మకూరుకు వస్తుండటంతో బందోబస్తు ఏర్పాట్లలో పోలీసు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

● ఇతర జిల్లాల నుంచి రప్పించాల్సిందే!

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని భద్రత కోసం జిల్లా నుంచి 300 మంది పోలీసులు అమరావతికి వెళ్లారు. ఇప్పుడు సీఎం పర్యటనలో బందోబస్తు కోసం సిబ్బంది కొరత కనిపిస్తోంది. దీనిని అధిగమించేందుకు ఇతర జిల్లాల నుంచి పోలీసులను రప్పించాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలో ఉన్న అధికారులు, సిబ్బందితోపాటు పొరుగు జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించి సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పోలీసు అధికారులు అడుగులు వేస్తున్నారు.

● కాగా, ఆత్మకూరులో సీఎం పర్యటన సందర్భంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ ఇతర అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు.



ఆత్మకూరులో సీఎం పర్యటన సందర్భంగా ఎస్పీతో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన కలెక్టర్ ఆనంద్





అడ్డుకట్ట వేసి.. చేపలు పట్టేసి!

మండుతున్న ఎండలకు ఇంకిపోతున్న జలవనరుల్లో చేపలు పట్టేందుకు పల్లెవాసులు ఉత్సాహం చూపుతున్నారు. కోవూరు మండలం జమ్మిపాళెంలోని ఓ పంట కాలువలో నీరు ఇంకిపోయింది. ఇంకేముంది.. సమీప గ్రామపిల్లలు కాలువల్లోని బురదతో అడ్డుకట్టు వేసి చేపలు పట్టేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

కార్పొరేషన్‌లో ప్రక్షాళన!

నెల్లూరు నగర పాలక సంస్థలో అధికారుల ప్రక్షాళనకు సర్వం సిద్ధమవుతోంది. అవినీతి మరక అంటించుకున్న అధికారులను గుర్తిస్తున్న ఉన్నతాధికారులు వారిని బదిలీ చేసేందుకు దస్త్రాలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పలు విభాగాల అధిపతులకూ స్థానచలనం కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తుండగా అధికార పార్టీ ప్రతినిధులు, నేతల నుంచి లైన్‌క్లియర్ కోసం వేచిచూస్తున్నట్లు సమాచారం.

\- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



- అవినీతి మరక అధికారుల గుర్తింపు
- రెవెన్యూ విభాగంలోనే అత్యధికులు
- విభాగాధిపతులూ మారే చాన్స్
- రాజకీయ క్లియరెన్స్ కోసం వెయిటింగ్



కార్పొరేషన్‌లో రెవెన్యూ విభాగంపై పలు అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొందరు ఆర్‌ఐల తీరు విమర్శలకు తావిస్తోంది. ఓ ఆర్‌ఐ తన వద్ద కొత్త పన్ను వేసేందుకు రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నాడని బాధిత మహిళ గత కమిషనర్‌కు లేఖ రాసిన అంశం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇదే ఆర్‌ఐపై రూరల్లోని అధికార పార్టీ నేతలు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. మరో జీ+5 అపార్టుమెంట్‌కు రూ.1.80 లక్షలను సచివాలయ సిబ్బంది ద్వారా వసూలు చేయించగా దీనికి సంబంధించిన వాయిస్ రికార్డింగ్ హల్‌చల్ చేస్తోంది. ఇలా చాలామంది ఆర్‌ఐల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి ఆర్‌ఐలను మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

● ఏమీ చేయలేని సూర్యతేజ

రెవెన్యూలో ఆర్‌ఐలుగా పాతుకుపోయి మాట వినడంలేదన్న కారణంగా రెవెన్యూ విభాగాన్ని సమూలంగా గత కమిషనర్ సూర్యతేజ ప్రక్షాళన చేశారు. ఆపై తెరపైకి వచ్చిన నూతన ఆర్‌ఐలలో ముప్పాతిక శాతం మంది పాతవారికంటే రెండింతల అవినీతికి ఆజ్యం పోశారన్న విమర్శలు వచ్చాయి. కొందరు ఆర్‌ఐలపై ఆధారాలతో సహా ఫిర్యాదులు అందాయి. అయితే, వీరందరిని తానే నియమించాను కాబట్టి చర్యలు తీసుకుంటే తన నిర్ణయం తప్పవుతుందన్న ఉద్దేశంతో గత కమిషనర్ ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. చివరకు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు సైతం ప్రశ్నించినా సరైన సమాధానం చెప్పలేకపోయారు. రెవెన్యూ వసూళ్లలోనూ లక్ష్యం చేరుకోలేకపోయినా మందలించలేని దుస్థితికి చేరుకున్నారు. ఇదే అదునుగా కొందరు రెవెన్యూ అధికారులు అక్రమ వసూళ్లలో పేట్రేగిపోయారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి.

● నందన్‌కు సవాలే!

ఎఫ్ఏసీ హోదాలో ప్రస్తుత కమిషనర్‌గా ఉన్న వైవో నందన్‌కు రెవెన్యూ విభాగంలోని పాలన సవాల్‌గా మారింది. పది మంది విస్తీర్ణం కలిగిన ఆర్‌ఐల పరిధిని ఆరుగురికే కుదించిన గత కమిషనర్ నిర్ణయం తాజాగా తంటాలు తెచ్చిపెడుతోంది. స్థానిక కార్పొరేటర్లతో వివాదాలు పెంచుకుంటున్న ఆర్‌ఐల వ్యవహారం నియోజకవర్గ పెద్దలకు తలనొప్పిగా మారింది. నిబంధనలు పాటించకుండా వీఎల్టీలు లేకుండానే భవనాలకు పన్నులు వేయడం కొందరు కార్పొరేటర్లకు కోపం తెప్పిస్తుండగా భారీగా ఎన్ఎంసీ ఖజానాకు గండిపడుతోందని వారంతా వాపోతున్నారు.

● విభాగాధిపతుల్లోనూ మార్పు?

కార్పొరేషన్ కార్యాలయంలోని కొందరు విభాగాధిపతులకు ఆయా సెక్షన్లపై అవగాహన లేదు. ఇటీవల జరిగిన బదిలీల్లో వీరందరిని బలవంతంగా సెక్షన్ల హెడ్‌లుగా నియమించారు. దీంతో వారు సెక్షన్లలో ఫైళ్లను క్లియర్ చేయలేక అవస్థలు పడటంతోపాటు మరి కొందరు సెలవుల పై వెళ్లిపోతున్నారు. దీంతో కార్యాలయంలో పాలన ఇబ్బందికరంగా మారుతోంది. అధికారుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుంటున్న ఉన్నతాధికారులు వారికి విభాగాలు మార్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రేపటి 'పాలిసెట్'కు సర్వం సిద్ధం!

● హాజరుకానున్న 4,073 మంది విద్యార్థులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ఏసుదాసు తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నెల్లూర, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ల లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 30వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. గంట ముందుగానే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. నెల్లూరులో 2,599 మంది, 527, కావలిలో 596, కందుకూరులో 351 మంది మొత్తం 4,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇక కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా లైజన్ ఆఫీసర్స్ చర్యలు చేపట్టడంతోపాటు పోలీస్, వైద్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష నిర్వహణ సమయంలో ఫోన్లువాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పదిమంది చీఫ్ సూపరింటెండెంట్లు, 12 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, 200 మందికిపైగా ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా చీఫ్ అబ్జర్వర్‌తోపాటు నాలుగు డివిజన్‌లకు నలుగురు పరిశీలకులు పరీక్షలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

8 లో..
పీజీఆర్ఎస్‌కు 455 వినతులు
● అత్యధికం రెవెన్యూ శాఖవే ● కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
జగన్ అబద్ధాలు నమ్మొద్దు!
● ఉలవపాడులో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
బాధ్యతతో పని చేయండి
● న్యాయాధికారులకు జిల్లా న్యాయమూర్తి ఆదేశం

'ప్యాకేజీ-1' ఫైళ్లు మాయం!

పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఎన్ని ఆరోపణలు వచ్చినా విచారణకు మాత్రం అధికారులు సాహసించడం లేదు. తాజాగా ప్యాకేజీ-1కు సంబంధించిన కీలక ఫైళ్లు క్వాలిటీ కంట్రోల్ ఈఈ కార్యాలయంలో కనిపించడం లేదు. ఎన్నిసార్లు వెతికినా ఫైళ్ల జాడ లేకపోవడంతో ఈ విషయాన్ని క్యూసీ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. అదే సమయంలో నెల్లూరు సెంట్రల్ డివిజన్‌లో కూడా కొన్ని రిక్విజిషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లు కనిపించడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

- క్యూసీ కార్యాలయంలో జాడలేని రిక్విజిషన్లు
- తర్జనభర్జన పడుతున్న అధికారులు
- సెంట్రల్ డివిజన్‌లోనూ ముందుకు సాగని విచారణ
- ఆరోపణలు నిగ్గు తేల్చకుండానే సర్దుకున్నారా?
- హైకోర్టులోనూ కౌంటర్ వేయకుండా దోబూచులాట
- కాంట్రాక్టర్‌కు బిల్లుల మంజూరుకు ప్రయత్నాలు

నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్క్ అనుకున్న విధంగా పూర్తి కాలేదు. అనేకసార్లు రివైజ్ చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగలేదని, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే నాడు ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటికి 47 బిల్లులు చెల్లించారు. 2020 జూలైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దాని ప్రకారం అధికారులు ప్రీక్లోజ్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021 ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో రూ.4.12 కోట్లను అదనంగా చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమిషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకు పైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా ఇష్టమొచ్చినట్లు ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.



● ఇక్కడ విచారణ లేదు.. అక్కడ కౌంటర్ లేదు

ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందుతుంటే వాటిపై ఇరిగేషన్ ఉన్నతాధికారులు గానీ జిల్లా ఉన్నతాధికారులు గానీ కనీస విచారణ కూడా జరపలేదు. నెల క్రితమే కలెక్టర్ వివరణ కోరినా అధికారులు పూర్తిస్థాయి వివరణ ఇవ్వలేదు. ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈను విచారణాధికారిగా నియమించినా విచారణ ముందుకు సాగడం లేదు. ఇప్పుడు ఒక్కొక్కటిగా ఫైళ్లు కనిపించకపోతుండడంతో అనేక అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. క్యూసీ అధికారులు దీనిపై తర్జనభర్జన పడుతున్నారు. కాగా ఈ బిల్లు కోసం కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికి పలుమార్లు హైకోర్టు నుంచి నోటీసులు అందినా ఇరిగేషన్ అధికారులు కౌంటర్ ఫైల్ చేయకపోతుండ్డం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

రిక్విజిషన్ ఫైల్స్ కనిపించడం లేదు

పెన్నా ప్యాకేజీ-1కు సంబంధించి సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి వచ్చిన రిక్విజిషన్ ఫైళ్లు కనిపించడం లేదు. పలుమార్లు వెతికినా ఫలితం లేదు. క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేసిన బుక్ మాత్రమే ఉంది. దాన్ని భద్రపరిచాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

\- ధనుంజయ నాయుడు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉదయగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురికాకుండా గ్రామస్థులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పీహెచ్‌సీ డాక్టర్ వినీత సూచించారు. సోమవారం పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌సీడీ సర్వేను త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం ఆర్యోగ కార్యకర్తలకు యూనిఫారములు అందించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9154
వెండి కిలో ధర	రూ. 99,100
వెండి ఒక గ్రాము	రూ.102.10

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- శాఖలవారీగా నివేదికలు సిద్ధంచేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రి ఆనం


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, మండల స్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరులో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం సాయంత్రం ఆత్మకూరులోని మున్సిపల్ కార్యాలయంలో మంత్రి ఆనం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాథమికంగా సీఎం రూట్ మ్యాప్‌ను ప్రకటించారు. 1వ తేదీ ఉదయం 11 నుంచి 3 గంటల వరకు ఆత్మకూరులో సీఎం పర్యటిస్తారని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాల వద్ద హెలిప్యాడ్ నుంచి నారంపేట సమీపంలో ఉన్న ఎంఎస్‌ఎంఈ పార్కుకు సీఎం చేరుకుంటారన్నారు. అక్కడ పైలాన్ ఆవిష్కరణ అనంతరం బస్సులో ఎంఎస్‌ఎంఈ పార్కును సందర్శిస్తారని చెప్పారు. అక్కడ నుంచి నెల్లూరుపాళెం సమీపంలోని గిరిజన కాలనీ లేదా బీసీ కాలనీకి చేరుకుని నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను సీఎం అందజేస్తారని చెప్పారు. అనంతరం ప్రభుత్వ జిల్లా వైద్యశాలను సందర్శించి రోగులతో మట్లాడతారని పేర్కొన్నారు. వైద్యశాలను 150 పడకలకు పెంచుతూ అదనపు భవన నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆత్మకూరులోని రవితేజ కళ్యాణ మండపం సమీపంలో ఎంపిక చేసిన ప్రైవేట్ లేఅవుట్ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సీఎం పాల్గొంటారని వెల్లడించారు. చివరిగా బీసీ రెసిడెన్షియల్ కళాశాల భోజనశాల సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ఒక గంట పాటు సుమారు 300 మంది కార్యకర్తల సలహాలు, సూచనలు తీసుకుంటారన్నారు. అనంతరం సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకుని విజయవాడకు చేరుకుంటారని వివరించారు. సీఎం పర్యటించే అంజనేయస్వామి గుడి నుంచి రవితేజ కల్యాణ మండపం వరకు పూర్తిగా మూసివేస్తున్నట్లు చెప్పారు. అధికారులంతా తమ శాఖలకు సంబందించిన నివేదికలను సిద్ధం చేసుకుని ఉండాలని ఆదేశించారు. సోమశిల హైలెవల్ కెనాల్, ఆప్రాన్ ఇతర మరమ్మత్తు పనులు, సోమశిల ఆలయం అభివృద్ధి పనులు గురుఇంచి ఇరిగేషన్‌శాఖ అధికారులు, సంగం బ్యారేజి నుంచి నేషనల్ హైవేకు కనెక్టివిటీ కోసం ఆర్‌అండ్‌బి అధికారులు, విక్రమ సింహపురి వర్సిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజి ఏర్పాటు, నెల్లూరుపాళెం వద్ద నగరవనం ఏర్పాటు, పది ఎకరాల్లో క్రీడా వికిసకేంద్రం ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేసుకుని తనకు అందజేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమీషనర్ సి గంగాప్రసాద్, డీఎస్పీ కె వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, తెలుగుగంగ ఎస్‌ఈ రాధాకృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ నాగరాజుకుమారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ హుస్సేన్‌సాహెబ్, మెప్మా పీడీ రాధమ్మ, పరిశ్రమలశాఖ జీఎం మారుతిప్రసాద్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి టీడీపీ ముఖ్యనేతలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జగన్నాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



ఉదయగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పీ జగన్నాథం తెలిపారు.

? తాగునీటి సమస్యను ఎలా అధిగమిస్తారు.

! ప్రస్తుతం భూగర్భ జలమట్టం 50 అడుగుల్లోనే ఉంది. భూగర్భ జలం అడుగంటి తాగునీటి సమస్య తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీటి సమస్య తీరుస్తాం.

? చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్నారా.

! మండలంలో మొత్తం 550 చేతిపంపులు ఉన్నాయి. సామగ్రి అందుబాటులో ఉంది. నిధుల సమస్య లేదు. క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మరమ్మతులకు గురైన చేతిపంపులను గుర్తించి బాగు చేయిస్తున్నాం.

? మండలంలో ఎన్ని రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి.

: మండలంలో 61 రక్షిత మంచినీటి పథకాలు పనిచేస్తున్నాయి. అవి మరమ్మతులకు గురైతే పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయిస్తున్నాం. లీకేజీల నివారణకు చర్యలు చేపడుతున్నాము.

సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు


ఆత్మకూరులో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న ఎన్‌ఎంయూ నేతలు, కార్మికులు



ఉదయగిరి : దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ (ఎన్‌ఎంయు) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఎన్‌ఎంయు నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు దఫాలు నిరసనలు, ధర్నాలు చేపట్టామని, అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రిలేనిరాహార దీక్షలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు డిపో కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయు నాయకులు మస్తానయ్య, పద్మారావు, సుధాకర్, శ్రీని వాసులు, హరి, కార్మికులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే దీక్ష నిర్వహించారు. అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సిబ్బందికి ప్రమోషన్లు ఇవ్వాలని, గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సలాం, వెంకటేశ్వర్లు, శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు వీఆర్‌ఏల నిరసన


తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

ఉదయగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీన స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల నాయకులు ఆర్ దుగ్గయ్య తెలిపారు. సోమవారం తోటి ఉద్యోగులతో కలసి తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం


పాఠకులకు వివరిస్తున్న లైబ్రేరియన్

వింజమూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు చిన్నారులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కొండయ్య తెలిపారు. జిల్లా గ్రంథాలయ అధికారి ఆదేశాల మేరకు చిన్నారులకు పుస్తకం చదివించడం, కథ చెప్పడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, స్పోకెన్ ఇంగ్లీషు, గణితం, చదరంగం, యోగా, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనాథాశ్రమం సేవలు ఎనలేనివి


సుబ్బరామప్రసాద్ గుప్తా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ

సీతారామపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేనిపల్లి గ్రామంలోని మంచికంటి సుబ్బరామ ప్రసాద్ గుప్తా అనాథ ఆశ్రమ సేవలు ఎనలేనివని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అన్నారు. ఆమె సోమవారం ఆశ్రమ వ్యవస్థాపకుడు సుబ్బారామ ప్రసాదు గుప్తా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పాలకొలను వెంకటరెడ్డి, లోకేష్‌రెడ్డి, బాలినేని మాబయ్య , వైసీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగమేశ్వరుడికి పల్లకీ సేవ


సంగమేశ్వరుడి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

సంగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో ఈనెల 5వ తేదీ నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు జరగ్గా పదహారు రోజుల పండుగను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం కామాక్షిదేవి, సంగమేశ్వరస్వామికి పల్లకీసేవ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి భారతి విద్యానికేతన్ కరస్పాండెంట్ మలినేని రమేష్ ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టీ పరిధిలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం సమీపంలో సోమవారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, జమీర్, కృష్ణారెడ్డి తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ నాయకుడు చదలవాడ హరీష్‌కుమార్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు టిడ్కో చైర్మన్ మేములపాటి అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సేవా కార్యక్రమాల్లో భాగంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దాడి భానుకిరణ్, ప్రమీల, అక్బర్‌బాష, వంశీకృష్ణ, వెంకటేష్, ప్రసాద్, ఉదయగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్య పరిష్కరించాలి : సీపీఎం


మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డుల్లో కలుషిత నీరు వస్తోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి మున్సిపాల్టీ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట, ఉలవదిబ్బ తదితర ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తోందని, ఆ నీటిని తాగితే అతిసార, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని పట్టణ ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు వాగాల శ్రీహరి, ఆళ్ల హజరత్తయ్య, కృష్ణమోహన్, షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణలో జాగ్రత్తలు పాటించాలి


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవోపీఆర్డీ

సీతారామపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని తొట్టెలలో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్త సేకరించి వేరు చేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సంపద సృష్టి కేంద్రాల తొట్టెల్లో తడి చెత్త కుళ్ళబెట్టి వానపాములు వదిలి వర్మీకంపోస్ట్ తయారు చేసుకోవడం ద్వారా పంచాయతీ ఆదాయం సృష్టించుకోవాలన్నారు. అనంతరం బసినేనిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ గోపి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ


గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచి

సంగం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి సోమవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

గుక్కెడు నీటి కోసం గ్రామస్థుల ఇక్కట్లు


మరమ్మతులకు గురైన చేతిపంపు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల సరిహద్దు గ్రామమైన జీ.కొత్తపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని చేతిపంపు మరమ్మతులకు గురవడంతో అటుగా ప్రయాణాలు సాగించే గ్రామస్థులు, ప్రయాణికులు గుక్కెడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవికాలం కావడంతో ప్రధాన రహదారికి ఆనుకొని ఉండే ఆ చేతి పంపును చూసిన ప్రతి ఒక్కరూ దాహార్తి తీర్చుకునేందుకు ఎంతో ఆశగా పరుగులు తీసి అది పనిచేయకపోవడంతో నిరాశగా వెనుతిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. చేతి పంపు మరమ్మతులకు గురైన విషయం తెలియక పోవడంతో గుక్కెడు నీటి కోసం గంటల తరబడి కుస్తీ పట్టినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం ఆయా మండలాలకు ఉద్యోగులు, ప్రజలు అటుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వాహనాల కోసం ఎదురుచూసే ప్రజలతో పాటు మోటారుబైకులపై ప్రయాణాలను సాగించేవారు నీటి కోసం అల్లాడాల్సి వస్తోంది. నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిలోని చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

వ్యక్తి అనుమానాస్పద మృతి


రవి మృతదేహం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యో): మండలంలోని మైపాడు బీచ్‌లో ఆదివారం సాయంత్రం కోవూరు మండలం చెర్లోపాలెం గిరిజన కాలనీకి చెందిన కవరగిరి రవి (42) తన బంధువులతో కలిసి మైపాడు బీచ్‌లో సేద తీరుతుండగా రవి అదృశ్యమయ్యాడు. అతను కనిపించక పోవడంతో బంధువులు రవి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని ఆచూకీ కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. సోమవారం ఉదయం మొత్తాలు సమీపంలోని రావూరు కండ్రిగ సమీప పొలాల్లో శవమై కనిపిం చాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో రైలులో ప్రయాణికురాలి మృతి

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నుంచి సోమవారం కావలికి రైల్లో వస్తుండిన ప్రయాణికురాలు గరటాల అచ్చెమ్మ(56) మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలి కుమార్తె లక్ష్మి వివరాల మేరకు.. కావలి పట్టణం వైకుంఠపురంకు చెందిన అచ్చెమ్మ శ్రీకాళహస్తిలో రెండు నెలలుగా ఉంటుంది. తెలిసిన వారి సాయంతో శ్రీకాహస్తీర్వుడి ఆలయానికి వచ్చే భక్తులకు బొట్లు పెడుతూ వచ్చిన నగదుతో జీవనం సాగిస్తుంది. 10 రోజుల కొకసారి కావలిలో ఉంటున్న కుమారుడు, కుమార్తె వద్దకు వచ్చి వెళ్లేది. ఈ క్రమంలో ఆరోగ్యం సరిలేక పోవడం, మే 1వ తేదీన పెన్షన్ తీసుకొనేందుకు ఆమె కావలికి వచ్చేందుకు బయలుదేరింది. ఈ విషయం కుమార్తెకు ఫోన్ చేసి శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో ఉన్నానని చెప్పింది. ఉదయం 9గంటల సమయంలో అచ్చెమ్మ ఫోన్ నుంచి తోటి ప్రయాణికులు ఆమె కుమార్తె లక్ష్మికి ఫోన్ చేసి మీ అమ్మ రైలులో ప్రయాణిస్తూ స్పృహలేకుండా పడిపోయిందని, మీరు స్టేషన్‌కు వచ్చి తీసుకువెళ్లాలని చెప్పారు. దీంతో లక్ష్మి కుటుంబ సభ్యులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల సహాయంతో అచ్చెమ్మను దించుకుని ఆటోలో ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో గంట క్రితమే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మద్యం దుకాణం వద్ద ఘర్షణ

- ఇద్దరికి గాయాలు
- బంగారు గొలుసు అపహరణ


నెల్లూరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - జొన్నవాడ రహదారిలోని ఓ ప్రైవేటు డెయిరీ సమీపాన ఉన్న మద్యం దుకాణం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఐదు సవర్ల బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళి తే.... జిల్లా ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి మక్తా ప్రవీణ్‌బాబు తన స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు ప్రైవేటు డెయిరీ వద్ద ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. అదే సమయంలో కాగులపాడుకి చెందిన మీరయ్య, మరో ఇద్దరు కూడా వీరితో పాటు మద్యం తాగేందుకు వచ్చారు. వీరంతా మద్యం తాగుతున్న సమయంలో పక్కనే కూర్చుని మద్యం తాగుతున్న నగరంలోని మన్సూర్‌నగర్ వాసులపై పడింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ మొదలై ప్రవీణ్, అతడి స్నేహితుడు మెట్టా అవినాష్‌కు గాయాలయ్యాయి. ఈ క్రమంలో అవినాష్ మెడలో ఉన్న ఐదుసవర్ల బంగారు గొలుసును మన్సూర్‌నగర్‌వాసులు అపహరించుకుపో యినట్లు తమకు ఫిర్యాదు అందిందని సీఐ తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మద్యం దుకాణంలో చోరీ


మద్యం దుకాణం సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

మనుబోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ముగ్గురు యువకులు రెండు మోటార్‌సైకిళ్లపై వచ్చి అలికిడి చేయగా నిద్రిస్తున్న వాచ్‌మెన్ కేకలు వేశాడు. యువకులు అతనికి కత్తి చూపించి బెదిరించారు. దుకాణం వెనుక ఉన్న షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌ను ధ్వంసం చేసి అందులోని రూ.2వేలు తీసుకున్నారు. బయట ఉన్న వాచ్‌మెన్‌ను వారితో మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని అక్కంపేట వద్ద వదిలేసి పరారీ అయ్యారు. సోమవారం ఉదయం సీఐ రామకృష్ణారెడ్డి దుకాణంను సీసీ ఫుటేజీని సీఐ పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లోని ముగ్గురు వ్యక్తులు ఇంతకు ముందు ఎప్పుడైనా దుకాణంకు వచ్చారా, లేదా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. శివరాకేష్ తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోటలో ఆదివారం అర్ధరాత్రి గ్రావెల్ తరలిస్తున్న 4 టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు.. రుద్రకోట రైల్వే ట్రాక్ కు పడమర వైపు నుంచి అర్ధరాత్రి గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	188
స్కిన్‌లెస్	208

కోడిగుడ్ల ధర (100): 430

న్యూస్ బాక్స్

సీతారాములకు 16 రోజుల పండుగ

బిట్రగుంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బృదావనంలోని కోదండ రామాలయంలో సీతారామలక్షణాంజనేయులకు సోమవారం పదహారు రోజుల పండుగ ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం చందన అలంకరణ భక్తుల కనువిందు చేసింది. సాయంత్రం ప్రత్యేక పూలాంకరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాదవపాలెంలోని కోదండరాముని ఆలయంలో స్వామి, అమ్మవార్ల పదహారు రోజుల పండుగను పురస్కరించుకుని ఉదయం గణపతి పూజ, గెముడు రాళ్ల అభిషేకాలు, హోమం, పూర్ణాహుతి, కుంకుమ పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం గ్రామ పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వీధిలైట్ల ఏర్పాటు

లింగసముద్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల పంచాయతీలోని పెంట్రాల, చీమలపెంట గ్రామాల్లో సోమవారం వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలో పంచాయతీ పరిధిలోని పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాల్లో వీధిలైట్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిలో చాలా లైట్లు పగిలి పోగా, కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగులు

బిట్రగుంట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో బీఎంఆర్ ట్రస్ట్ సౌజన్యంతో సోమవారం పేద ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల కార్యక్రమం జరిగింది. బీఎంఆర్ యువసేన అధ్యక్షుడు సమీఉల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాలసుబ్రహ్మణ్యం పాల్గొని చిన్నారులకు పౌష్టికాహారం కిట్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, ప్రైవేటు వైద్యులు రఫీ, శంషుద్దీన్, జామియామసీదు ముత్తావలి, నవీద్, ఖాసీమ్, అలీం, ఖలీల్, అజీమ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల చట్టంపై అవగాహన

బిట్రగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని ఏపీఎం నవీన్ అన్నారు. బోగోలు స్త్రీశక్తి భవనంలో సోమవారం అంగన్వాడీ, వెలుగు, పొదుపు సభ్యులతో కిశోరీ వికాశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సౌజన్య, నెల్లూరుకు చెందిన సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు సాధన, సూపర్‌వైజర్లు జే.వాణి, డీ.సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర్రంలో చోరీకి యత్నం

లింగసముద్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో దొంగలు చోరీకి యత్నించారు. సోమవారం సాయంత్రం ఆరోగ్య కేంద్రం తలుపు తాళం పగులగొట్టి ఉండటాన్ని ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్‌గా ఉండే ఎంఎల్‌హెచ్‌పీ శ్రీహరి పొలానికి వెళ్తూ గమనించారు. వెంటనే ఆరోగ్య కేంద్రం లోపలికి వెళ్లి చూడగా మందులు, కుర్చీలు, ఫ్యాన్లు అన్నీ ఉన్నాయని గుర్తించారు. ఆయన వెంటనే లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో జి శ్రీనివాసులు దృష్టికి తెచ్చారు. అయితే ఈ ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఎంఎల్‌హెచ్‌పీ గత శుక్రవారం మెటర్నటీ సెలవు పెట్టి, చార్జ్ అప్పగించి వెళ్ళిపోయినట్లు సీహెచ్‌వో శ్రీనివాసులు చెప్పారు. దొంగలు ఆదివారం అర్ధరాత్రి చోరీకి ప్రయత్నించి ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

నేడు వీవీ పాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.



ఇస్కపల్లి తీరంలో విలాసవంతంగా నిర్మించిన కాటేజీ

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్ల మంజూరు
- వైసీపీ పాలనలో ముందుకు సాగని పనులు
- నిర్మాణాలు పూర్తికాకనే శిథిలావస్థకు కట్టడాలు

పర్యాటకానికి నోచని

ఇస్కపల్లి తీరం!

అల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లి తీరంలో పర్యాటక కేంద్రం ఏర్పాటు పడకేసింది. తీరప్రాంతాలకు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలన్న ఆశయంతో గత టీడీపీ ప్రభుత్వం ఇస్కపల్లి తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు 2016లో రూ2.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పటి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాజధాని కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావులు స్థలాన్ని సమకూర్చారు. ఆ స్థలంలో అప్పట్లో నిర్మించిన భవంతులు పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

● వైసీపీ ప్రభుత్వంలో ముందుకు సాగని పనులు

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి సహజంగా ప్రభుత్వాలు చొరవ చూపవు. కానీ అటువంటి పరిస్థితుల్లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇస్కపల్లి తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. కాటేజ్‌లు, క్యాబిన్లు ఏర్పాటు తదితర నిర్మాణాలు జరపగా ప్రారంభానికి ముందే 2019లో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ పనులను వైసీపీ నేతలు మరిచారు. పనులను అర్థాంతరంగా నిలిపివేయడంతో నిర్మించిన భవంతులు శిథిలమవడం, ధ్వంసమవడమే కాకుండా మందుబాబులకు అడ్డాగా మారాయి. పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని భావించి పర్యాటకుల కోసం అన్ని హంగులతో నిర్మించిన కాటేజ్‌లు నేడు మోడుగా దర్శనమిస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ కాటేజ్ భవనాలు నేడు మందుబాబులకు, చీకటి కార్యాకలాపాలు జరిపే వారికి అడ్డాగా మారిపోయాయి. కనీసం వినియోగించకుండానే నూతన భవనాలను అలానే వదిలి వెళ్లిపోవడంతో చెట్లు మొలిచి శిథిలావస్థకు చేరుకున్నాయి.



ధ్వంసమైన నిర్మాణం

● ఆవిరైన తీరప్రాంత వాసుల ఆశలు

పర్యాటక కేంద్రం ఏర్పాటైతే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, నలువైపుల నుంచి పర్యాటకులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారని, ఈ క్రమంలో చిరు వ్యాపారాలు పెరిగి ఒక ప్రత్యేక గుర్తింపు వస్తుందని భావించిన ఈ ప్రాంత వాసుల ఆశలు ఆవిరైపోయాయి. పర్యాటకులతో సందడిగా మారడంతో పాటు తమలో కొంతమందికైనా ఉపాధి దొరుకుతుందని భావించిన మత్స్యకారులకు నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా పర్యాక కేంద్రంగా మారుతుందా అని ఎదురుచూస్తున్నారు.

ఈ ప్రాంతం అభివృద్ధి జరిగేది



పర్యాటక కేంద్రం కోసం నాయకులు కృషి చేసి సాధించినా ఫలితం లేకుండా పోయింది. నిర్మాణాలు పూర్తి చేసి నిర్వహణ చేస్తూ ఉంటే పర్యాటకుల రాకపోకలతో మా ప్రాంతం కొంతమేర అభివృద్ధి చెందేది. మాకు చిరు వ్యాపారాలు జరిగేవి. ప్రభుత్వం నిలుపుదల చేయడంతో నిర్మించిన కట్టడాలు నిరుపయోగంగా మారాయి.

- పొన్నపూడి శ్రీనివాసులు, మత్స్యకారుడు, ఇస్కపల్లిపాలెం

ప్రభుత్వం మారడంతోనే సమస్య



టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పర్యాటక కేంద్రం పనులు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉచితంగా స్థలం ఇవ్వడంతోపాటు కొంత నిధులు టీడీపీ నాయకులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడైనా పర్యాటక కేంద్రంగా మారుస్తారని ఆశిస్తున్నాం.

- గంగపట్నం శీనయ్య, మాజీ ఎంపీటీసీ, ఇస్కపల్లి

పాముూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం

- ● పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగింపు
- ● కిరోసిన్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం ● కందుకూరులో ఉద్రిక్తత

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సోమవారం పామూరు రోడ్డు సర్కిల్‌కు నాలుగు వైపులా ఉన్న ఆక్రమణల తొలగింపుల తొలగింపునకు చర్యలు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో సర్కిల్‌కు చేరుకుని ఫైనల్‌గా సర్వే అధికారులు నిర్ధారించిన మార్కింగ్ వరకు ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. పామూరు రోడ్డుకు పడమర వైపున ఉన్న ఆక్రమణలు, ఆక్రమిత స్థలంగా భావిస్తున్న చోట ఉన్న శాశ్వత నిర్మాణాలను కూడా కూల్చివేశారు. అలాగే కొండముడుసుపాలెం రోడ్డుకు తూర్పువైపున, గుర్రంవారిపాలెం వెళ్లేరోడ్డుకు దక్షిణం వైపున ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసి ఉన్న బంకులను పూర్తిగా తొలగించారు. అలాగే పామూరు రోడ్డు సర్కిల్‌లో నిర్మించి ఉన్న బస్ షెల్టర్‌ను కూడా కూల్చివేశారు. ఈ క్రమంలో స్థానికులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. మాదాల మాల్యాద్రి, ఆయన కుటుంబసభ్యులు సర్వే ప్రమాణాలు పాటించకుండా మార్కింగ్ ఇచ్చారని, మాపై కక్షసాధింపు చర్యలలో భాగంగా అన్యాయంగా తమ స్థలాలలో ఉన్న నిర్మాణాలను కూల్చివేసేందుకు సిద్ధపడ్డారని విమర్శిస్తూ ఆక్రమణల తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారు ఎంత అడ్డగించే ప్రయత్నం చేసినా సీఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో నలుగురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయటంతో ఆక్రమణల తొలగింపునకు మార్గం సుగమం అయింది. ఒక దశలో మాదాల పావని ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆక్రమణల తొలగింపు ఆపకపోతే ఆత్మహత్యకు పాల్పడుతానంటూ ఆందోళన చేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు ఆమెను, మాదాల మాల్యాద్రిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే జిల్లా సర్వేయరుకు మరో సారి కొలతలు వేసి కచ్చితమైన హద్దులు తేల్చాలని తాము కోరి ఉన్నామని, ఆ అవకాశం కూడా ఇవ్వకుండా హడావిడిగా ఆక్రమణలు తొలగించారని వారు వాపోయారు.



కందుకూరులో తొలగిస్తున్న ఆక్రమణలు

● అన్నివైపులా తొలగించాలి

పామూరు రోడ్డుకు పడమర వైపున మాత్రమే ఆక్రమణలు తొలగించి తూర్పువైపున ఇంకా చేపట్టకపోవటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పడమర వైపున అధికంగా ఆక్రమణలు ఉన్నాయని అందుకే ముందుగా తొలగిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆక్రమణలు ఎక్కువ ఉన్నా తక్కువ ఉన్నా పూర్తి స్థాయిలో తొలగించకుంటే సర్కిల్ అభివృద్ధికి ఆశించిన లుక్ రాదని అంటున్నారు. విమర్శల సంగతెలా ఉన్నా ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపుకు సిద్ధపడటం సాహసోపేత చర్యగా అభినందిస్తున్న ప్రజలు విమర్శలకు తావులేకుండా అన్నివైపులా తొలగించాలని కోరుతున్నారు.

‘డీబీఎస్’ చైర్మన్ శీనయ్యతో మంచి అనుబంధం

● నివాళులర్పించిన మంత్రి ఆనం

కావలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కావలి డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసులునాయుడుతో రాజకీయంగా, వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి సోమవారం ఉదయం మంత్రి కావలిలోని దామిశెట్టి నివాసానికి వెళ్లి శీనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచి వ్యక్తిత్వం గల విద్యాదాత, కావలికి సుపరిచితులైన శ్రీనివాసులు నాయుడు మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.



దామిశెట్టి శీనయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో సన్ని వంశీకృష్ణ

కావలిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : వేసవి విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సన్ని వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్డీవో ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ముఖ్యంగా పెద్దలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్, డాక్టర్ రవికుమార్, హరినారపరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వలు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు పరామర్శ

రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియా బాధిత చిన్నారులను ఆర్డీవో పరామర్శించారు. చిన్నారులకు అందిస్తున్న వైద్యసేవల గురించి డాక్టర్లు రమ్య, శ్రీధర్‌లను అడిగి తెలుసుకుని మందులు, పౌష్టికాహారం అందించారు. తలసేమియా బాధిత చిన్నారులు సదరమ్ సర్టిఫికెట్ పొందితే ఆర్టీసీ దివ్యాంగులకిచ్చే రాయితీ బస్సు పాసులు ఇప్పిస్తామన్నారు. చిన్నారులకు ఉచిత వైద్యసేవలందిస్తున్న వైద్యులు గోపి, శ్రీధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొన్నారు.



తలసేమియా బాధిత చిన్నారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వంశీకృష్ణ

ఫొటోలు, వీడియోలు

శాశ్వత జ్ఞాపకాలు : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఫొటోలు, వీడియోలను తమ కెమెరాల్లో బంధించి పది కాలాల పాటు జ్ఞాపకాలుగా నిలిపేవారు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం సోమవారం పట్టణంలోని నారాయణ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్ విన్నపం మేరకు అసోసియేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఒక నెలలో చూపుతానని తెలిపారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్ఆర్ ప్రసాద్, కార్యదర్శిగా చిలకపాటి మధు, ఉపాధ్యక్షులుగా అనూక్, మాల్యాద్రి, జాయింట్ సెక్రటరీ చంద్ర, కోశాధికారి మల్లిక్, జాయింట్ కోశాధికారి సుధీర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ సభ్యులందరికి గుర్తింపు కార్డులు, హెల్మెట్లు పంపిణీ చేశారు. అలాగే అసోసియేషన్ కుటుంబాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు పొందిన వారిని అభినందిస్తూ బహుమతులు అందచేశారు. అసోసియేషన్ భవనానికి చెన్నా శ్రీనివాసులు, ఓంకార్‌లు రూ.3లక్షల విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫఇటోగ్రాఫర్స్ జాతీయ అధ్యక్షుడు ఎడిట్‌పాయింట్ రమేష్, జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, కావలి డీఎస్పీ పీ. శ్రీధర్, మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు, డాక్టర్ రామస్వామి, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, పోట్లూరు శ్రీనివాసులు, తిరువీది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2వ తేదీన జరుగబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను పురస్కరించుకుని చిలకలూరిపేట ఇన్‌చార్జిగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని టీడీపీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం చిలకలూరి పేటకు వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును కలిసి నరేంద్ర మోదీ పర్యటనపై చర్చించారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ముస్లిం జేఏసీ ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్రవాదులు పైశాచికంగా దాడి చేసి అమాయక ప్రజల ప్రాణాలు తీయడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి కందుకూరులో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మస్కజ్ మసీదు నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఏ మతం కూడా ఉగ్రవాదాన్ని సమర్థించదని, అమాయక ప్రజల ప్రాణాలు తీసే ఉగ్రవాదులను ముస్లింలుగానే భావించకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విపత్తును భారతీయులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని ఉగ్రవాదాన్ని పూర్తిగా నాశనం చేయటమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.



ఉగ్ర దాడిని నిరసిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

కావలిటౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం డిపో వద్ద రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు కుందుర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎన్ఎంయు జిల్లా కార్యదర్శి మురళీ మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి మీరామొహిద్దీన్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి రఘునాథరెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి ఎంఏ కలామ్, సహాయ కార్యదర్శి పీవీ రెడ్డి, ప్రచార కార్యదర్శి మధుసూదనరావు, ముఖ్య సలహాదారుడు జానా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు



జాబ్‌మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రియాజుద్దీన్

ఉద్యోగాలకు 83 మంది ఎంపిక

కందుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో 83 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫాక్స్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, టీవీఎస్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ తదితర 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 208మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల అభ్యున్నతే లక్ష్యం

● కాంతారావు, ఏపీఎం, కొండాపురం



కొండాపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపులోని ప్రతి మహిళ అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రతి గ్రూపులో మహిళకు పెట్టుబడి కింద రుణాలను అందచేసి తద్వారా లాభాలను ఆర్జించి కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు సీడ్ క్యాపిటల్ (సూక్ష్మ రుణ పెట్టుబడి ప్రణాళిక) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా రుణాలు కావాల్సిన మహిళలు స్థానిక వీవోఏలను సంప్రదించాలి.

? మండలంలో ఎన్ని పొదుపు గ్రూపులు, సంఘ బంధాలు ఉన్నాయి.

! మండలంలో 965 పొదుపు గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపుల్లో 9,650 మంది సభ్యులు ఉన్నారు. 32 సంఘ బంధాలు ఉన్నాయి. సంఘ బంధాల అధ్యక్షులు ప్రతి నెల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

? సూక్ష్మ రుణ పెట్టుబడి పథకం ద్వారా ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు.

! సూక్ష్మ రుణ పెట్టుబడి పథకం ద్వారా ఒక యూనిట్‌కు రూ.40 వేల చొప్పున 2020-21వ సంవత్సరంలో 34 మంది పొదుపు మహిళలకు రుణాలు అందచేశాం. ఈ పథకం కింద రుణాలు కావాల్సిన సభ్యులు దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి రుణాలు మంజూరు చేస్తాం.

? 2024-25 సంవత్సరంలో ఎన్ని రూ.కోట్ల రుణాలు అందచేశారు.

! 2024- 25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ అయిన పొదుపు గ్రూపులకు రూ.25 కోట్లు, స్త్రీ నిధి పథకం కింద రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేశాం. ఈ రుణాలు పొందిన వారు దాదాపు 98 శాతం వరకు తిరిగి చెల్లించారు.

శివారు ఆయకట్టులో రెండో పంట సాగు చేయొద్దు

కావలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దిగువన కావలి కాలువ కింద శివారున కావలి, జలదంకి మండలాల ఆయుకట్టుకు రెండో పంటకు సాగునీరు అందడం కష్టమైనందున అక్కడ పంటలు సాగు చేయవద్దని సాగునీటి సంఘాలు, రైతులు నిర్ణయించారు. కావలి, జలదంకి మండలాల సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతులతో సోమవారం కావలి జలవనరుల శాఖ కార్యాలయంలో సాగు నీటి పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవి కాలం కావడంతో శివారు ప్రాంతాలకు సో మశిల నీరు సక్రమంగా అందదని, కనుక రై తులు రెండో పంట సాగు చేసుకోకపోవటమే మంచిదని అభిప్రాయపడ్డారు. ఒకవేళ చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండి ఒకటి, రెండు తడులకు సోమశిల నీరు అవసరమను కుంటే రెండో పంట వేయాలా, ఆరుతడి పంటలు వేయాలా అనేది నిర్ణయం తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. చెరువుల్లో ఇప్పటికే నీరు లేనివారు మాత్రం రెండో పంట, ఆరుతడి పంటలు వేయకపోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. కాలువ కింద ఉన్న చెరువులకు తాగునీటికి, పశువులకు ఇబ్బంది లేకుండా సోమశిల నీరు ఇస్తారని, వాటిని జాగ్రత్త చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కావలి ఇన్‌చార్జి ఈఈ పీఎం ఖాన్, డీఈ రామారావు, ఏఈ జంపాని కిర ణ్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన జరగనున్న పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలీసెట్ కోఆర్డినేటర్ సుశీల్‌కుమార్ ప్రియ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాల, రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అ భ్యర్థులను హాల్‌టికెట్‌తో ఉదయం 10 గంటలకు పరీక్ష హాలు లోకి అనుమతిస్తారని పేర్కొ న్నారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ పరీక్షకు 1 నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

అల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పురిణి సమీపంలో ఫైడేరు కట్టపై కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సోమవారం సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3200, ఒక కోడిపుంజు, 5 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'కోర్టు' సమస్యలకు తక్షణ పరిష్కారం

బాధ్యతతో పని చేయండి ● న్యాయాధికారులతో జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల బదిలీ అయిన మొదటి తరగతి ఐద వ అదనపు జ్యూడిషియల్ న్యాయాధికా రి గండికోట దేవిక, మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి డీ.అఖిల గౌరవార్థం సోమవారం మధ్యాహ్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కో లుసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బార్, బెంచ్ రెండూ బొమ్మాబొరుసు లాంటివన్నారు. న్యాయాధికారులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసినప్పుడే కక్షిదారులకు న్యాయం జరుగుతుంద న్నారు. న్యాయాధికారులు అత్యధిక కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని, వారికి న్యాయవాదులు సహకరించాలని ఆయన సూచిం చారు. అనవసరమైన పిటిషన్లు వేయకుండా, కోర్టు విలువైన సమయాన్ని ఆదా చేయాలని న్యాయవాదులకు హితవు పలికారు. సాయంత్రం ఐదు గంటలు అయిపోగానే ఇంటికి వెళతామని న్యాయాధికారులు అంటే కు దరదని, బాధ్యతతో



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

పనిచేయాలని అన్నారు. కోర్టు ప్రాంగణంలో ప్రధాన సమస్యగా ఉన్న ట్రాఫిక్‌ను వెంటనే పరిష్కరిస్తామని, రేపటి నుంచే కోర్టు ప్రాంగణంలోని గేటును తెరచి రాకపోకలు కొనసాగించేలా చేస్తామన్నారు. అతి త్వరలోనే లిఫ్ట్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కేసులు వేసిన వెంటనే ఎలాంటి కాలయాపన లేకుండా వాటికి నెంబర్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఐఏ పిటిషన్లను ఈరోజు పరిగణలోకి తీసుకుని వాటికి నెంబర్లు ఇచ్చామని తెలిపారు. జైలు స్థలాన్ని జిల్లా కోర్టు ప్రాంగణం లోకి తెచ్చే విషయమై హైకోర్టు దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పీ.ఉమా మహేశ్వర్‌రెడ్డి, పీ.సుందరయ్య యాదవ్ ప్రసంగించారు. తమకు జరి గిన ఘనసన్మానానికి బదిలీపై వెళుతున్న న్యాయాధికారులు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయాధికారులు, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

జగన్ అబద్ధాలు నమ్మొద్దు

రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉలవపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అప్పటి చంద్రబాబు పాలనపై ఎలాంటి అబద్ధాలు ప్రచారం చేయించి అధికారం చేజిక్కించుకొన్నాడో అవే అబద్ధాలను నమ్ముకొని మళ్లీ అధికారంలోకి రావాలని జగన్‌మోహన్‌రెడ్డి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాడని, వాటిని నమ్మవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. మన్నేటికోటలో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం బద్దిపూడిలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ప్రారంభిం చారు. రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రో డ్లు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడు తూ దుష్ప్రచారాలతో గద్దెనెక్కిన పార్టీ వైసీపీ అని, అబద్ధాలు ప్రచారం చేయడం జగన్ నైజమని విమర్శించారు.


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి

చంద్రబాబు అంటే బ్రాండ్ : వీపీఆర్

నిశ్శేషంగా ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశలో పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలు, ఐటీ రంగంలో రాష్ట్రం దూసుకుపోతుందని కొనియాడారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మత్స్యకారులకు వేట నిషేధిత భృతి కింద రూ.30 కోట్లు వారి అకౌంట్లులోకి నిర్ణీత కాలంలో వేశారన్నారు. ఈ సందర్భంగా బద్దిపూడికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కూనం రాఘవరెడ్డి తన అనుచరులు సుమారు 400 మందితో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బద్దిపూడి టీడీపీ సీనియర్ నాయకులు కూనం బ్రహ్మానందరెడ్డి, మన్నేటకోట సర్పంచు పులివర్తి బసవయ్యనాయుడు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 115 మంది ఫిర్యాదుదారులు వచ్చి వారి సమస్యలు తెలిపారు. డీటీసీ డీఎస్పీ గిరిధర్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేదికలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

● నగరంలోని కరెంటాఫీసులో లైన్‌మన్‌గా పనిచేస్తున్న కత్తి పరంధామయ్య షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నగదు తీసుకొని మోసం చేశాడని జనార్ధన్‌రెడ్డి కాలనీకి చెందిన శివకుమార్ ఫిర్యాదు చేశాడు. రూ.1.50


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు

లక్షలు తీసుకుని, ఉద్యోగం ఇప్పించకపోవడంతో నగదు అయినా ఇవ్వాలని అడిగితే మాపైనే కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

● హైదరాబాద్‌కి చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.4.75 లక్షల నగదు తీసుకొని నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేసిందని కావలి ప్రాంతానికి చెందిన యువకుడు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

● ఇందుకూరుపేట ప్రాంతానికి చెందిన పెనుబర్తి సురేష్, అతడి భార్య ఓ బ్లడ్‌బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నామని చెప్పి, అదే ప్రాంతానికి చెందిన ఏడు మందికి ఓ వైద్యశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.13 లక్షలు తీసుకున్నారని బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. సంవత్సరం నుంచి ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపింది. న్యాయం చేయాలని ఎస్పీని కోరింది.

పాతకక్షలతో కత్తితో దాడి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరులో మునునూరు రఘురెడ్డి పాత కక్షలను మనసులో పెట్టుకుని బొప్పిడి శ్రీనివాసులు అనే వృద్ధుడిపై సోమవారం కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో భుజం, ఛాతీకి పక్కన రెండు కత్తిపోట్లు పడటంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. కత్తితో దాడి చేసి మళ్లీ సమ్మెటతో (పెద్దసుత్తి) దాడి చేసే యత్నంలో అప్పుడే అక్కడికి వచ్చిన మరో వ్యక్తి అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నిందితుడు పరారయ్యాడు. గాయపడిన శ్రీనివాసులును బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

కష్టపడి గద్దెనెక్కి!

ఆదర్శం aadarsham

ఒక వ్యక్తి ఒక రంగంలో రాణించడమే గొప్ప.. అలాంటిది ఏకంగా మూడు రంగాల్లో రాణించడమంటే ఆయన పట్టుదల.. అంకిత భావం కార్యదీక్షాదక్షతలు ఏపాటివో అర్థం చేసుకోవచ్చు. మాస్టర్స్ క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారుడిగా, వ్యవసాయంలో ఆదర్శ రైతుగా, కోళ్ల పరిశ్రమలో ఉపాధి పొందుతూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు గద్దె వెంకటేశ్వర్లు. కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారానికి చెందిన రైతు వెంకటసరసయ్య, అక్కమ్మ దంపతుల 7వ సంతానం వెంకటేశ్వర్లు. 10వ తరగతి వరకు నెల్లూరులో, కావలిలో డిగ్రీ వరకు చదివిన వెంకటేశ్వర్లు స్వగ్రామంలో వ్యవసాయానికే పరిమితం కాకుండా ఏదైనా సాధించాలన్న దృఢసంకల్పం ఏర్పరుచుకున్నారు.

● ఇటు వ్యవసాయం చేస్తూ.. అటు చిన్ననాటి కల నెరవేర్చుకుంటూ..
● బరిలో నిలిస్తే పతకం అందుకోవాల్సిందే!
● కోళ్ల పరిశ్రమ ద్వారా పలువురికి ఉపాధి
● ఆదర్శప్రాయుడు వెంకటేశ్వర్లు



కావలిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే క్రీడల్లో ఆసక్తి కలిగి ఉన్నా అప్పటి ఆర్థిక పరిస్థితులు, కుటుంబ నేపథ్యం దృష్ట్యా వెంకటేశ్వర్లు క్రీడలకు సమయాన్ని వెచ్చించలేకపోయారు. పరిస్థితులు సహకరించకపోయినా పట్టుదలతో అవకాశం దొరికినప్పుడల్లా జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటాడు. పెళ్లి, పిల్లలు, వ్యవసాయం సంసార జీవితంతో 40 ఏళ్లు పూర్తయినా క్రీడలపై మక్కువ, చిన్ననాటి కల సాకారం చేసుకునేందుకు ఆయన దృష్టి మాస్టర్స్ క్రీడలపై పడింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక విజయాలు తన ఖాతాలో వేసుకున్నారు.

● **సాధించిన విజయాలు**


100, 200, 400, 800, 1500 మీటర్లు, హాఫ్ మారథాన్, 4100 మీటర్ల రిలే, 4400 మీటర్ల రిలే పరుగు పందేలలో దేశవ్యాప్తంగా జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. 2011లో ముంబాయిలో జరిగిన జాతీయస్థాయి హాఫ్ మారథాన్ (21కెఎమ్) అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం, నెల్లూరులో 2017, 18 సంవత్సరాల్లో వరుసగా రెండుసార్లు మారథాన్ (44కెఎం) బంగారు పథకాలు, 2019లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో బంగా రు పథకం అందుకున్నారు. 2012లో తమిళనాడులోని కడలూరు లో జరిగిన జాతీయస్థాయి 5కేఎం, 1500 మీటర్ల పరుగు పందెం లో బంగారు పథకాలు, 2018లో వారణాసిలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో రజతం, 2016 హర్యానాలో జరిగిన పోటీల్లో ఏపీ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి 4100 మీటర్ల రిలే పరుగులో బంగారు పథకం సాధించారు. 2019 గుజరాత్‌లో ని వడోదరలో జరిగిన 100 మీటర్ల పరుగులో బంగారం, 200 మీటర్ల పరుగులో రజత పథకాలు సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎన్నో విజయాలు సాధించి తన చిన్ననాటి కల సాకారం చేసుకున్నారు వెంకటేశ్వర్లు.

● **కోళ్ల పరిశ్రమలో రాణిస్తూ..**

దగదర్తి ప్రాంతంలో ఒకప్పుడు చిన్న కోళ్ల పరిశ్రమ స్థాపించగా నేడు లక్షకుపైగా కోళ్ల పెద్ద పరిశ్రమగా ఏర్పడింది. ప్రత్యక్షంగా 25 మంది పరోక్షంగా 80 మందికిపైగా ఉపాధి కల్పిస్తూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

● **ఉత్తమ రైతుగా..**

కావలిలో డిగ్రీ పూర్తి చేసుకుని స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ పూర్తిస్థాయి రైతుగా వెంకటేశ్వర్లు స్థిరపడ్డారు. క్రిమిసంహారక మందులు వాడకుండా సంప్రదాయ ఎరువులు వాడుతూ ఎక్కువ దిగుబడులు సాధిస్తూ జిల్లాస్థాయిలో ఉత్తమ రైతుగా అప్పటి రాష్ట్ర మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మీ, అప్పటి కావలి ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మల నుంచి పురస్కారాలు అందుకున్నారు.



అంకితభావంతో కష్టపడాలి!

ఏ రంగంలోనైనా రాణించాలంటే అంకితభావం, పట్టుదలతో పనిచేయాలి. ఓటములు గెలుపునకు మెట్లుగా మలుచుకుని పైకి ఎదగాలి. యువత సక్సెస్ దొరకలేదని కుంగిపోకుండా సమయం వృథా చేయకుండా చిత్తశుద్ధితో శ్రమిస్తేనే విజయం సొంతం చేసుకోవచ్చు.

- గద్దె వెంకటేశ్వర్లు

సోమశిలలో 51.268 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 51.268 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి వాణి

ముత్తుకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రజలకు పూర్తి అవగాహన అవసరం అని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వాణి తెలిపారు. పిడతాపోలూరులోని సచివాలయంలో ఆవరణలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయంలో పనులు కాకపోతే నేరుగా కలిసి ఫిర్యాదు చేసినా.. పోస్టు కార్డ్ రాసినా లేదా టోల్ ఫ్రీ నెంబరుకి కాల్ చేసినా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కేసు ఏస్థాయిలో ఉన్నా లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందుతుందని చెప్పారు. గ్రామ స్థాయిలో చట్టాలపైన అవగాహనకు ఇలాంటి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు తమ సమస్యలను జడ్జి దృష్టికి తీసుకురాగా తగు సూచనలిచ్చారు. సదస్సులో కోవూరు జూనియర్ సివిల్ జడ్జి శివ నమ్రత పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. జడ్జిలను స్థానిక టీడీపీ నాయకులు దండు శ్రీనివాసులు, కొండారెడ్డి, పెంచలయ్య, కరిముల్లా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ హేమంత్‌కుమార్, డీడీవో శేషగిరిరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయాధికారులను సత్కరిస్తున్న స్థానిక నాయకులు


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి చెందిన ఘటన వలేటివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అత్తింటివారిపాలెంకు చెందిన కొల్లూరి మాధవరావు(47) మోటారు సైకిల్‌పై అత్తింటివారిపాలెం నుంచి పామూరుకి వెళ్తుండగా జాతీయ రహదారి క్రాస్ రోడ్డులో మట్టి ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి యజమాని మృతితో కుటుంబసభ్యులు బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మరిదినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మాధవరావు మృతదేహం

డిప్యూటీ స్పీకర్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చడాన్ని ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వాఖ్యలు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం రఘురామ వాఖ్యలకు నిరసనగా నగరంలోని పూలే బొమ్మ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ అనుచిత వాఖ్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆయన్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లను తిరిగి నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహ న్‌రావు, గోగుల శ్రీనివాసులు, పుల్లయ్య, రెహనా బేగం, కొండాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్ దాతృత్వం.. మారుతున్న దివ్యాంగుల జీవనచిత్రం

● ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లతో వారిలో మానసిక ధైర్యం

నెల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) దాతృత్వంతో జిల్లాలోని దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయి. నడక దుర్లభమై దుర్భరంగా సాగుతున్న వారి జీవితాల్లో వీపీఆర్ చేతుల మీదుగా అందుతున్న ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో ఎదురైన దివ్యాంగులను చూసి చలించిపోయిన వేమిరెడ్డి గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్నికల అనంతరం జిల్లాలోని దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కొన్ని నెలలుగా ఆయన నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను గుర్తించి ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేస్తున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, కందుకూరు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లో సుమారు 850 మందికిపైగా ట్రై సైకిళ్లు అందజేశారు. కరెంటు బ్యాటరీ సాయంతో నడిచే ఈ ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ విలువ ఒక్కొక్కటి 40వేల రూపాయలకుపైగా ఉంటుంది. ఇందుకోసం కోసం ఆయన కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అంతేకాదు.. వాటి మరమ్మతుల భారం కూడా దివ్యాంగులపై పడకుండా రెండేళ్లపాటు వాటి నిర్వహణ బాధ్యతలను వీపీఆర్ ట్రస్ట్ నిర్వర్తిస్తుందని వీపీఆర్ ప్రక టించడంపట్ల దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ పంపిణీని ఒక పండుగ వాతావరణంలో నిర్వహించడం విశేషం. సాధారణంగా ఏదైనా ఒక వస్తువును ఉచితంగా పంపిణీ చేయడమే గొప్పగా భావిస్తారు. త్వరలో నెల్లూర నగరం, రూరల్ నియోజకవర్గాలలోనూ దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందజేయనున్నారు.


తన నివాసంలో దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి

కోట్లాది రూపాయల సొంత నిధులతో 150 గ్రామాలకుపైగా శుద్ధ జలం అందించడంతో పాటు పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వీపీఆర్ ట్రస్ట్ ఇప్పుడు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు ఇవ్వడంపై నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని తన నివాసంలో ఆరుగురు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను ఎంపీ వీపీఆర్ పంపిణీ చేశారు. ఇప్పటిదాకా జరిగిన పంపిణీల్లో అనివార్య కారణాల వల్ల ట్రై సైకిళ్లు అందుకోలేని దివ్యాంగులకు తన నివాసంలో అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు 455 వినతులు

● కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. భూ సమస్యలు పరిష్కరించాలని, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇప్పించాలనే కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. జేసీ కే. కార్తీక్ అధికారులను పిలిచి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదికలో వచ్చే అర్జీలను మానవత్వంతో పరిశీలించి, పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ మళ్లీ వస్తున్న అర్జీల విషయంలో రెవెన్యూ అధి కారులు అత్యంత జాగ్రత్త వహించాలన్నారు.ఈ వేదికకు మొత్తం 455 అర్జీలు అందాయి. వీటి లో రెవెన్యూ శాఖకు 194, పోలీస్‌శాఖకు 63, మున్సిపల్ శాఖకు 30, సర్వేకు 43, పంచాయ తీరాజ్ శాఖ సంబంధించిన 31 అర్జీలు అందాయి.

● పిత్రార్జితంగా వచ్చిన భూమిని కొందరు ఆక్రమించారని, వారి బారి నుంచి భూమిని కాపాడాలని పొదలకూరు మండలం మహమ్మదాపురం మాజీ సర్పంచి పల్లిబోయిన వెంకట శేషయ్య జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల భవనాలు, అగ్ని మాపక నిబంధనల అమలు, స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ వంటి వాటిని అధికారులు తనిఖీ చేయాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శిఖరం నరహరి జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● తండ్రి తనకు ఇచ్చిన 9 సెంట్లు పొలాన్ని ఆదాం అనే వ్యక్తి ఆక్రమించి, గత నెలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కందుకూరు ప్రకాశంకాలనీకి చెందిన దివ్యాంకురాలు హెబ్సిక జేసీకి వినతిపత్రం సమర్పించారు. అధికారులు న్యాయం చేసి , ఆదాంను కఠినంగా శిక్షించాలని కోరారు.


అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● **టెన్త్ విద్యార్థులకు అభినందన**

ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వలేటివారిపాలెం కేజీబీవీ విద్యార్థిని జీ.వైష్ణవి, లింగసముద్రం కేజీబీవీ విద్యార్థిని ఎం.అమృతప్రియ, కలిగిరి కేజీబీవీ విద్యార్థిని పీ.మహిమకు జేసీ కార్తీక్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఉదయ భాస్కర్, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్ రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో సుజాత, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీఈవో బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

2న జ్ఞానమందిరం ప్రారంభం

కోవూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):ఆదిశంకరాచార్యుల జన్మదినం సందర్భంగా ఇనమడుగులోని సత్యానందాశ్రమంలో మే 2న జ్ఞాన మందిరం ప్రారంభిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ తెలిపారు. ఈ సందర్భంగా సాధు సతుర్పుషల సమక్షంలో మే 1,2,3తేదీల్లో సమా గమం నిర్వహి స్తామన్నారు. రమణ మహర్షి ఆదేశాలతో సత్యానంద స్వామి ఇనమడుగులో సత్యానందాశ్రమాన్ని నిర్మించినట్లు వివరించారు. యాదగిరి, శివగిరి, కాశీ, హరిద్వార్, రుషీకేష్ నుంచి 150మంది పీఠాధిపతులు వస్తారని చెప్పారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9154
వెండి కిలో ధర	రూ. 991.00
వెండి ఒక గ్రాము	రూ.102.10

వాలుకు అడ్డంగా లోతు దుక్కులతో మేలు

- ఇలా చేస్తే భూమి కోతలు ఉండవు
- పెరుగనున్న తేమశాతం

పొదలకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):రానున్న ఖరీఫ్‌సీజన్ దృష్ట్యా ఇప్పటినుంచే వనరులను సిద్ధం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఏ రకం విత్తనాలు జల్లాలి..ఎలాంటి ఎరువులు వాడాలి..సాగుకు నేలను ఎలా సిద్ధం చేసుకోవాలనే అంశాలపై అవగాహన పెంచుకుంటే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు. అన్నిటికంటే ముందుగా ఎండలు అధికంగా ఉండగానే లోతు దుక్కులు చేసుకుంటే పంటలకు ప్రయోజనకరం గా ఉంటుందని చెబుతున్నారు. ఎండాకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు తెలియజేస్తు న్నారు.

● బల్లెపు నాగలితో దుక్కులు చేయాలి

ఖరీఫ్‌లో సాగుచేసే పంటకు ఇప్ప టినుంచే సాధారణ ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలికి బదులు (కల్టి వేటర్)గా పొలాన్ని లోతుదుక్కులు వేసే నాగలి రోటివేటర్, బల్లెపు నాగలి వాడితే నేల 30నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దిగితే మేలు ఎక్కువగా ఉంటుంది. వాలుకు అడ్డంగా దుక్కి చేస్తే భూ కోతకు గురవకుండా తేమ ఎక్కువగా పె రుగుతుంది. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండడంతో కలుపు మొక్కలు విపరీతంగా పెరుగుతాయి.

● పంట రక్షణ చర్యలు..

సాగు చేయనున్న పంటలకు కలుపు బెడద అధికమయ్యే అవకాశం లేకపోలేదు. దీనిని నివారణకు లోతు దుక్కులు ఉపయోగపడుతాయి. ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో వరి పంటలు సాగు భూమిని వేసవి దుక్కి చేయడంతో పంటకు నష్టం కలిగించే ఎరువు, క్రిమికీటకాలు మొదట్లోనే నశించి నష్టం జరగకుండా మేలు జరుగుతుందని పొదలకూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ వివరించారు.



దుక్కి చేస్తున్న రైతు

న్యూస్ బాక్స్

రైతులకు అవగాహన

వెంకటాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):ఇస్కపాళెం, నిడిగుంటపాళెం, గూ డ్లూరవారి పాళెం గ్రామాల రైతులకు సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల్లో మట్టి నమునాలను సేకరించి భూసార పరీక్షలు చేశారు. భూ సార పరీక్షల ఆధారంగా వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన రసాయన ఎరువులను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మండల అధికారి హరికరుణాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఖాతా నుంచి నగదు మాయం

కోవూరు, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు తొట్టెంపూడి అంకయ్య ఎస్‌బీఐ అకౌంటు నుంచి రూ.లక్ష మాయమైనట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... తొట్టెంపూడి అంకయ్య గోల్డ్ లోన్ చెల్లించేందుకు ఫోన్‌యాప్ తెరిచారు. అదే సమయంలో తన ఫోన్ అప్డేట్ అడగడంతో ఆయన అంగీకరించారు. ఫోన్ అప్డేట్ పూర్తయిన తరువాత అకౌంటులో దాచుకున్న రూ.లక్షను గుర్తు తెలియని వ్య క్తులు డ్రా చేశారు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు.

ముగిసిన అగ్నిమాపక సేవా పక్షోత్సవాలు

ముత్తుకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సామాజికసేవలో ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అగ్ని మాపకదళం అత్యు న్నత సేవలందిస్తున్నట్లు కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేది తెలిపారు. సోమవారం పైనంపురంలో జాతీయ అగ్నిమాపక సేవా ముగింపు పక్షోత్సవాలను నిర్వహించి మాట్లాడారు. గతేడాది ముత్తుకూరు, టీపీగూడూరు మండలాల్లో 157అగ్నిమాపక సేవలు అందించినట్లు తెలిపారు. సమాజానికి అత్యవసర సేవలు అందించడంలో వారి నిబద్ధత ప్రశంసనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

మనుబోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో వేసవి విజ్ఞాన శిబిరంను సోమవారం మనుబోలులో ప్రారంభించారు. గ్రంథాలయం శిథిలావస్థలో ఉండడంతో బాండాగారు అరుణ్‌కుమార్ దగ్గర్లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పిల్లలతో కథలు చదివించడం, కథలు చెప్పించడం, బొమ్మలు గీయించే కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిరోజూ శిబిరంకు రావాలని పిల్లలను ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయల ప్రదర్శన

రాపూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి ఆరోగ్యవంతులుగా ఉండాలని రాపూరు ఎంపీడీఓ భవానీ పేర్కొన్నారు. సోమవారం రాపూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను ఎంపీడీఓ భవానీ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ అశోక్, వెంకటాద్రి, యల్‌టూ రాజ్యలక్ష్మి, బలరామిరెడ్డి, అంకమ్మరాజు తదితరులు ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయ కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీడీవో భవానీ

డొక్కా సీతమ్మకు ఘన నివాళి

పొదలకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కాసీతమ్మ వర్ధంతిని సోమవారం జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రామికనగర్, గిరిజన కాలనీలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రామికనగర్ గిరిజనకాలనీల్లో మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అనంతరం జనసేన సర్వేపల్లి సమన్వ యకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మాట్లాడారు. ఆకలి అని వచ్చిన ప్రతిఒక్కరికీ ఆకలి తీరుస్తూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేరు తెచ్చుకున్న మహా తల్లి డొక్కా సీతమ్మ అని కొనియాడారు. ఆమె అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడు చుకోవాలని కోరారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆమె పేరుతో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయించడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో నారదాసు రవి, మధు, సందూరి శ్రీహరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదరణకు నోచుకోని గిరిజనకాలనీ

కోవూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ పక్కాగృహాల్ని కట్టించే పాలకులు, ఉన్నతాధికారులు తహసీల్దారు కార్యాలయానికి సమీపంలోని గిరిజన కాలనీపై నిర్లక్ష్యం చూపుతున్నారు. స్థానిక గాంధీ సంఘంలోని గిరిజనులకు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ నడిబొడ్డులో పూరిగుడిసెల్లోనే నివాసం ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని వీరి సొంత ఇళ్లు నిర్మించుకునే ఆర్థికస్థోమత వీరికి లేదు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పేదలందరికీ ఆదర్శ గృహాల్ని నిర్మించామని చెబుతున్న ప్రభుత్వ యంత్రాం గం తమపై శీతకన్ను వేశారని వాపోతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా అడపాదడపా వారిచ్చిన అర్జీలను అధికారులు, నాయకులు స్వీకరించి వాగ్దానాలు ఇచ్చేరా కాని అమలుకు నోచుకునేలా చర్య లు మాత్రం తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వీరి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోవూరులోని గాంధీ సంఘం కాలనీ

బడి మానేసిన పిల్లలున్నారు



కాలనీ పక్కనే మూడు పాఠశాలలు ఉన్నాయి. కాలనీ పిల్లల్ని బడికి తీ సుకెళ్లేందుకు అధికారులు ఎవరూ రారు. కూలీ పను లు, పంచాయతీ చెత్తాచె దారం తొలగించే పనులకు వెళ్లి కాలం వెళ్లదీస్తున్నాం. బడి ఈడు పిల్లల్ని పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలి.

- పలుగోటి వెంకటేశ్వర్లు, గిరిజన సంఘం, కోవూరు

ఆధార్‌కార్డులు ఇవ్వండి



గిరిజనులమైన మాపై అందరూ చిన్నచూపు చూస్తున్నారు. మా అభివృద్ధిని పట్టించుకోరు. ఇప్పటికీ బియ్యం, ఆధార్‌కార్డులు కూడా లేవు. ఇస్తామంటారు.. ఇవ్వరు. మేము సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. పెద్దోళ్లు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

- గండికోట సుబ్బరత్నమ్మ

పందుల బీభత్సంతో జనం బెంబేలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీతో పాటు జొన్నవాడ, పెనుబల్లి గ్రామాల్లో పందుల బెడద ఎక్కువగా ఉంది. ప్రతిరోజూ ఇవి ఇళ్ల ముందు స్వైరవిహారం చేస్తూ బీభత్సం చేస్తున్నాయి. వీటితో చిన్నారులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యజమానులు వీటి బాహాటంగా వదిలేయండతో పట్ట ణంలో కాలువలు, పొలాల్లోకి వదిలేస్తున్నారు. ఈ విషయంపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిమీద దౌర్జన్యాలకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాతా నాగేశ్వరరావుకు పరామర్శ

విడవలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న అన్నారెడ్డిపాళెం టీడీపీ సీనియర్ నాయకులు తాతా నాగేశ్వరరావును సోమవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గ్రామానికి వచ్చి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరిత గతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ నాయకులు ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, కొడూరు శ్రీనివాసులురెడ్డి, బొమ్మి సురేంద్ర, దయాకర్ గౌడ్, ములుకూరు రవికుమార్‌రెడ్డి, పాముల రమణయ్య, సత్యవోలు సత్యంరెడ్డి, కామేశ్వరమ్మ, అయ్యప్ప, భవాని ఉన్నారు.

సిద్దేశ్వరులకు ప్రత్యేక పూజలు

సైదాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):సిద్దేశ్వర కోనలో సోమవారం నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, సారంగధర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దలకోన ఆవరణలో ఉన్న దక్షిణామూర్తి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జ్ఞానసిద్ధ ఆశ్రమంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

రాపూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాపూరు డిపోలో సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్‌ఎంయుఏ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయుఏ కార్యదర్శి ఎన్.వి. రమణయ్య, సిహెచ్ కొండయ్య, క్రిష్ణయ్య, శ్రీహరి, పులయ్య, టి.కె. రావు, ఖాదర్ బాష, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంచలకోన ఆలయ ఫెస్టివల్ కమిటీ చైర్మన్‌గా చెన్ను తిరుపాల్‌రెడ్డి

రాపూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఫెస్టివల్ పాలక మండలి కమిటీని దేవాదాయ శాఖ సోమవారం ప్రకటించింది. చెన్ను తిరుపాల్ రెడ్డి చైర్మన్‌గా, మరో 13 మందిని సభ్యులుగా నియమించారు.

ఇస్కపాళెంలో పంచాయతీ రికార్డుల మాయం..?

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలోని కొన్ని రికార్డులు మాయం అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై 8నెలలుగా డీఎల్‌పీఓ, డీపీఆర్వో విచారణ చేపట్టి కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినా సరైన సమాధానం ఇచ్చిన దాఖలాలు లేవు. తదుపరి చర్యలు నిమిత్తం గత 20రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసినా సమాధానం లేదని ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తెలిపారు.

● సెక్రటరీపై ఫిర్యాదు

ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినా బేఖాతరు చేస్తూ రికార్డులు స్వాధీనం చేయకపోవడంపై సెక్రటరీ మల్లికార్జునరెడ్డిపై గత శనివారం బుచ్చి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సోమవారం ప్రస్తుత కార్యదర్శి సికిందర్ తెలిపారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీగా ఉన్నప్పటి నుంచే మల్లికార్జునరెడ్డి సెక్రటరీగా విధుల్లో వున్నారు. తరువాత నగర పంచాయతీగా ఏర్పాటైన తరువాత ఆ పంచాయతీలోని కొంతభాగం నగర పంచాయతీలో కలిసింది. అప్పటినుంచి అర్బన్ పరిధిలోని ఆ సచివాలయానికి మల్లికార్జునరెడ్డే సెక్రటరీగా పనిచేస్తూ గతేడాది అక్టోబర్‌లో ఇందుకూరుపేటకు బదిలీ అయ్యారు. బుచ్చి నగర పంచాయతీగా ఏర్పాటైనపుడే మల్లికార్జునరెడ్డి అర్బన్ పరిధిలోని ఇస్కపాళెం ప్రాంతానికి చెందిన రికార్డులు నగర పంచాయతీకి అప్పగించాల్సి వుండగా అందులో కొన్ని రికార్డులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. రికార్డుల్లో ప్రధానమైన 2006 నుంచి 2011 వరకు లేఅవుట్లకు సం బంధించిన తీర్మానం (మినిట్స్ బుక్స్) పుస్తకాలు, ప్రభుత్వ భూముల ముఖ్యమైన రికార్డులు మాయమైనట్టు సమాచారం. రికార్డుల మాయంపై ఇస్కపాళెం మాజీ ఉప సర్పంచు శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి లోకాయుక్త, కలెక్టర్‌కు ఫిర్యాదుతో విషయం వెలుగు చూసింది. ఈ మేరకు మల్లికార్జునరెడ్డి సస్పెండ్‌కు జడ్పీ కమిషనర్‌ను ఆదేశించినా ఆ దిశగా చర్య తీసుకోలేదని తెలిసింది. స్వాధీనం చేయాల్సిన రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివే దిక ఇవ్వాల్సి ఉందని కార్యదర్శి సికిందర్ తెలిపారు.

అవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలి

● ప్రవల్లిక, కసుమూరు వైద్యాధికారి



వెంకటాచలం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రతిఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా సురక్షి తంగా ఉంటారని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవల్లిక తెలిపారు.

? తీసుకోవాల్సిన జాగ్రత్తలేవి?

! ఎండలు తగ్గేంత వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల తర్వాతే పనులు, ప్రయాణాలు చేసుకోవాలి. ముఖ్యమైన పనులుంటే ఉదయం 10లోపు, సాయంత్రం 4 తర్వాత చేసుకుంటే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో ప్రయాణాలు చేయాల్సి వస్తే గొడుగు, కనీసం 5 లీటర్లకు తగ్గకుండా నీరు తాగితే వడదెబ్బ నుంచి ఉపశమనం పొందుతారు.

? వడదెబ్బ లక్షణాలు ఏవి?

! కండరాల తిమ్మిరి, భారీగా చెమట పట్టడం, విపరీతమైన బలహీనత, తలనొప్పి, తల తిరగడం, కళ్లు బైర్లు కమ్మడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే గుండెదగో శం, స్పృహ కోల్పోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉండొచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే వైద్యుడి సంప్రదించాలి.

? వడదెబ్బ తగిలితే ఏ చర్య తీసుకోవాలి.

! వడదెబ్బ తగిలితే తక్షణమే చల్లని ప్రదేశానికి బాధితుడిని తరలించాలి. శరీరాన్ని చల్లబడ్డాక నీరు తాపి తడిపిన వస్త్రాలను ఒంటిపై ఉంచాలి. ముఖ్యంగా గాలి తగిలేటట్లు చేయాలి. అనంతరం ఓఆర్‌ఎస్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాపించాలి.

? వైద్యశాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుంది.

! గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలతో వడదెబ్బపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాం. ఆరోగ్యశాఖ వడదెబ్బ నివారణ, చికిత్స కోసం పలు చర్యలు చేపడుతుంది.

స్వచ్ఛభారత్ లక్ష్యం మూలకేనా..?



స్థానిక పంచాయతీ ప్రజలకు ఇంటిలోని చెత్తను పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఇచ్చేందుకు కొన్ని నెలలకిందట పంచాయతీ పాలకవర్గం, అధికారులు చెత్తబుట్టలను కొను గోలు చేశారు. అందులో భాగంగా మారుతీనగర్, తొగటవీధి, పుట్టాయి గుంట, విఘ్నేశ్వరకాలనీ, పద్మావతినగర్, వినాయక మాన్యం, లింగం పల్లి, లింగంపల్లితోపుల్లో రెండు నెలల కిందట పంపిణీ చేశారు. మిగతా వాటిని పట్టణంలో పంపిణీ చేయకుండా పట్టణ రెండో సచివాల యంలో ని స్టోరేజ్ గదిలో మూలనపడేశారు. వీటిని కూడా పంపిణీ చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. - పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

ఈ పగటి వెలుగెందుకు.. ?



మండలంలోని యల్లాయపాలెంలోని కొన్ని వీధిలైట్లు రాత్రి, పగలు అని తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. ఈ సమస్య తో విద్యుత్ వృథా కావడంతో పాటు అవసరమైన సమ యంలో వెలుగక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. -కొడవలూరు, (ఆంధ్రజ్యోతి)

C.R.I.M.E N.E.W.S

వ్యక్తి అనుమానాస్పద మృతి



రవి మృతదేహం

ఇందుకూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడు బీచ్‌లో ఆదివారం సాయంత్రం కోవూరు మండలం చెర్లోపాలెం గిరిజన కాలనీకి చెందిన కవరగిరి రవి (42) తన బంధువులతో కలిసి మైపాడు బీచ్‌లో సేద తీరుతుండగా రవి అదృశ్యమయ్యాడు. అతను కనిపించక పోవడంతో బంధువులు రవి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని ఆచూకీ కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. సోమవారం ఉదయం మొత్తాలు సమీపంలోని రావూరు కండ్రిగ సమీప పొలాల్లో శవమై కనిపిం చాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పన మృతిగా కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో రైలులో ప్రయాణికురాలి మృతి

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నుంచి సోమవారం కావలికి రైల్లో వస్తుండిన ప్రయాణికురాలు గరటాల అచ్చెమ్మ(56) మార్గమధ్యంలో గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలి కుమార్తె లక్ష్మి వివరాల మేరకు.. కావలి పట్టణం వైకుంఠపురంకు చెందిన అచ్చెమ్మ శ్రీకాళహస్తిలో రెండు నెలలుగా ఉంటుంది. తెలిసిన వారి సాయంతో శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయానికి వచ్చే భక్తులకు బొట్లు పెడుతూ వచ్చిన నగదుతో జీవనం సాగిస్తుంది. 10 రోజులకొకసారి కావలిలో ఉంటున్న కుమారుడు, కుమార్తె వద్దకు వచ్చి వెళ్లేది. ఈ క్రమంలో ఆరోగ్యం సరిలేక పోవడం, మే 1వ తేదీన పెన్షన్ తీసుకొనేందుకు ఆమె కావలికి వచ్చేందుకు బయలుదేరింది. ఈ విషయం కుమార్తెకు ఫోన్ చేసి శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్‌లో ఉన్నానని చెప్పింది. ఉదయం 9గంటల సమయంలో అచ్చెమ్మ ఫోన్ నుంచి తోటి ప్రయాణికులు ఆమె కుమార్తె లక్ష్మికి ఫోన్ చేసి మీ అమ్మ రైలులో ప్రయాణిస్తూ స్పృహలేకుండా పడిపోయిందని, మీరు స్టేషన్‌కు వచ్చి తీసుకువెళ్లాలని చెప్పారు. దీంతో లక్ష్మి కుటుంబ సభ్యులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల సహాయంతో అచ్చెమ్మను దించుకుని ఆటోలో ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో గంట క్రితమే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మద్యం దుకాణం వద్ద ఘర్షణ

- ఇద్దరికి గాయాలు
- బంగారు గొలుసు అపహరణ

నెల్లూరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - జొన్నవాడ రహదారిలోని ఓ ప్రైవేటు డెయిరీ సమీపాన ఉన్న మద్యం దుకాణం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఐదు సవర్ల బంగారు గొలుసు అపహరణకు గురైనట్లు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళి తే.... జిల్లా ఫైబర్‌నెట్ ఇన్‌చార్జి మక్తా ప్రవీణ్‌బాబు తన స్నేహితులతో కలిసి మద్యం సేవించేందుకు ప్రైవేటు డెయిరీ వద్ద ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. అదే సమయంలో కాగులపాడుకి చెందిన మీరయ్య, మరో ఇద్దరు కూడా వీరితో పాటు మద్యం తాగేందుకు వచ్చారు. వీరంతా మద్యం తాగుతున్న సమయంలో పక్కనే కూర్చుని మద్యం తాగుతున్న నగరంలోని మన్సూర్‌నగర్ వాసులపై పడింది. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ మొదలై ప్రవీణ్, అతడి స్నేహితుడు మెట్టా అవినాష్‌కు గాయాలయ్యాయి. ఈ క్రమంలో అవినాష్ మెడలో ఉన్న ఐదుసవర్ల బంగారు గొలుసును మన్సూర్‌నగర్‌వాసులు అపహరించుకుపో యినట్లు తమకు ఫిర్యాదు అందిందని సీఐ తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణం సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

మనుబోలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ముగ్గురు యువకులు రెండు మోటార్‌సైకిళ్లపై వచ్చి అలికిడి చేయగా నిద్రిస్తున్న వాచ్‌మెన్ కేకలు వేశాడు. యువకులు అతనికి కత్తి చూపించి బెదిరించారు. దుకాణం వెనుక ఉన్న షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌ను ధ్వంసం చేసి అందులోని రూ.2వేలు తీసుకున్నారు. బయట ఉన్న వాచ్‌మెన్‌ను వారితో మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని అక్కంపేట వద్ద వదిలేసి పరారీ అయ్యారు. సోమవారం ఉదయం సీఐ రామకృష్ణారెడ్డి దుకాణంను సీసీ పుటేజీని సీఐ పరిశీలించారు. సీసీ పుటేజ్‌లోని ముగ్గురు వ్యక్తులు ఇంతకు ముందు ఎప్పుడైనా దుకాణంకు వచ్చారా, లేదా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. శివరాకేష్ తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పట్టుబడిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

కావలి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోటలో ఆదివారం అర్ధరాత్రి గ్రావెల్ తరలిస్తున్న 4 టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వివరాల మేరకు.. రుద్రకోట రైల్వే ట్రాక్ కు పడమర వైపు నుంచి అర్ధరాత్రి గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	102
స్కిన్ చికెన్	188
స్కిన్‌లెస్	208

కోడిగుడ్ల ధర (100): 430



పరిమళ కుమారికి గిన్నిస్ రికార్డులో స్థానం

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదిత్యనగర్‌కి చెందిన పరిమళ కుమారి రామరాజు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం పొందారు. గత డిసెంబరు 1న ఆన్‌లైన్‌లో ప్రపంచ సంగీత కార్యక్రమం జరిగింది. అందులో 18 దేశాల నుంచి 1090 మంది మహిళలు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా కీబోర్డుపై సరళీస్వరాలు వాయించగా, 1046 మంది అర్హత సాధించారు. ఇందులో మరిమళ కుమారి కూడా ఉన్నారు. ఇందుకుగాను విజయవాడ మెట్రోపాలిటీ మిషన్ చర్చిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ రికార్డు ప్రతినిధులు ఆరస్టీస్ దండంగి ద్వారా ఈ అవార్డును ఆమె అందుకున్నారు.

న్యూస్ బాక్స్



అశ్వవాహనంపై భగవద్రామానుజాచార్యులు

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాథ స్వామి ఆలయంలో భగవద్రామానుజాచార్యులు తిరునక్షత్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

'శంకర్రావు అరెస్టు దుర్మార్గం'

నెల్లూరు (హరనాథపురం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావును అరెస్టు చేయడం దుర్మార్గమైనచర్య అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు అన్నారు. నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శంకర్రావు అరెస్టును ఖండించారు. విజయవాడలో శంకర్రావు ముందస్తు అనుమతితో నిర్వహించనున్న సభకు వెళుతున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడం సరైన చర్యకాదని అన్నారు. బీసీల అభ్యున్నతికి సమగ్ర కులగణన చేపట్టాలని, మహిళల రాజకీయ కోటాపై ఆయన చేస్తున్న కార్యక్రమాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ముంగర శైలజ, కిరణ్, నర్మదాబాయ్, జగదీశ్వరి, హారతి, రాముగౌడ్, తరుణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ ఎదురుగా జనసేన మహిళా నాయకురాలు గునుకుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం డొక్కా సీతమ్మ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నగర పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన 16వ డివిజన్ నాయకులు సుధామాధవ్, కారంపూడి కృష్ణారెడ్డి, ఏటూరి రవికుమార్, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

వేసవి తరగతులు..

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో సోమవారం వేసవి విజ్ఞాన తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు ఎం.సతీష్ కుమార్ ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థులకు గణిత సమస్యల పరిష్కారంతోపాటు ఇంకా అనేక విజ్ఞాన విషయాలు నేర్పించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయం కార్యదర్శి కుమార్‌రాజా, సిబ్బంది జితేంద్ర, కృష్ణయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్య జోన్-3 పరిధిలోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ ప్రతినిధులు ఆర్జేడీ జగన్నాథం పద్మకు విజ్ఞప్తి చేశారు. జోన్-3 ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను జేఏసీ ప్రతినిధులు సోమవారం గుంటూరులోని కార్యాలయంలో కలిసి అభినందించారు. అనంతరం వారి సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జేఏసీ కోచైర్మన్ కల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న రేషనలైజేషన్, బదిలీల్లో తమకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సర్వీస్ డిస్టర్బ్ అయిన వెంటనే జాప్యం లేకుండా సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కే సురేష్, నిర్వాహక కార్యదర్శి సైదులు, సంయుక్త కార్యదర్శి బుల్లా వీరయ్య పాల్గొన్నారు.



ఆర్జేడీ పద్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేఏసీ నాయకులు

ఐదున్నరేళ్లుగా

అందని బకాయిలు

- గతంలో మంత్రులు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?
- ఆందోళనలో జీజీహెచ్ సెక్యూరిటీ గార్డులు
- ప్రదక్షిణలు చేస్తున్నా... దక్కని ఫలితం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులకు ఐదున్నరేళ్లుగా వేతన బకాయిలు అందలేదు. దీంతో వారికి ఎదురుచూపులే మిగిలాయి. 'మీ వేతనాలకు ఎలాంటి ఢోకా లేదు. మీకు మేము హామీ ఇస్తున్నాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెంటనే బకాయిలు చెల్లించేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం'... అని గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు ఇచ్చిన హామీ. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చింది. అయినా వారికి నేటికీ బకాయిలు అందలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది.

జీజీహెచ్‌లో 134 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. 2019లో తిరుపతికి చెందిన బాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీ వీరి నిర్వహణ చేపట్టింది. అయితే అదే ఏడాది సెప్టెంబరుతో ఆ సంస్థ బాధ్యత తీరిపోయింది. అయినా సెక్యూరిటీ గార్డులు కొనసాగుతూనే ఉన్నారు. 2020లో సాలమన్ ఏజెన్సీకి బాధ్యతలు



అప్పగించారు. 2019 అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకుగాను ఏ ఏజెన్సీకి సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో జీజీహెచ్ ఆ వేతనాలు చెల్లించాల్సి ఉంది. పైగా కరోనాలో సెక్యూరిటీలు ఎంతో బాధ్యతగా పనిచేశారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గత ఆగస్టులో జీజీహెచ్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు అప్పట్లో సెక్యూరిటీ గార్డులు మంత్రిని కలిసి బకాయిల విషయం ప్రస్తావించారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అంతే కాక డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహ వచ్చిన సందర్భంలోనూ సెక్యూరిటీ గార్డులు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. అయినా ఇంతవరకు పరిష్కారం మాత్రం కాలేదు. 134 మంది సెక్యూరిటీలకు అప్పట్లో రూ. 8600 చొప్పున రూ. 34.57 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి బకాయిలు చెల్లించాలి.

ఇంత వరకు అందలేదు...

కరోనా కాలంలో ఎంతో కష్టపడ్డాం. అయితే 2019లో 3 నెలలు బకాయిలు నేటికి రాలేదు. చెల్లించాలని కోరుతున్నా ఫలితం ఉండటం లేదు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలు తక్కువగా ఉన్నా పని చేస్తూనే ఉన్నాం. పాత బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



- రామాంజనేయులు, జీజీహెచ్ సెక్యూరిటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఈ ప్రభుత్వమైనా పరిష్కరించాలి

ఐదున్నరేళ్లుగా పోరాడుతున్నాం. 3 నెలల బకాయిలు ఇస్తామన్న గత వైసీపీ మంత్రులు హామీ మరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ హామీ ఇచ్చిన వేతన బకాయిలు మాత్రం నేటికీ చెల్లించలేదు. కుటుంబం గడవడం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ ప్రభుత్వమైనా బకాయిలు చెల్లించాలి.



- సతీష్‌కుమార్, యునైటెడ్ మెడికల్ హెల్త్ యూనియన్ గౌరవాధ్యక్షుడు

'మన మిత్ర'ను సద్వినియోగం చేసుకోండి

సిటీ కమిషనర్ నందన్



వృద్ధురాలి ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రతీ పౌరుడు సద్వినియోగం చేసు కోవాలని ఎస్ఎంసీ కమిషనర్ వైవో నందన్ సూచించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని నగర వాసుల నుంచి వినతులను స్వీక రించారు. అనంతరం మాట్లాడుతూ మన మిత్ర ద్వారా వేగంగా సేవలు అందుతాయన్నారు. పురమిత్ర యాప్ ద్వారా పుర సేవలను పొందవచ్చన్నారు. పత్తేఖాన్‌పేటలో పెండెల వారివీధిలోని పురాతన బావిని అధికారులు వినియోగంలోకి తీసుకురావాలని ఆ ప్రాంతవాసులు కోరారు. అంతకుముందు కమిషనర్ సంతపేటలోని రైల్వేఫీడర్స్ రోడ్డు, 12వ డివిజన్‌లోని చింతారెడ్డిపాళెం, వావిలేటిపాడు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాగా 19, 45 డివిజన్లలో ఎంహెచ్‌వో చైతన్య పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

క్రీడల్లో ప్రత్యేక విద్యార్థుల

ప్రతిభ అభినందనీయం : జేసీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆగిరిపల్లిలోని హిల్ పారడైస్ పాఠశాలలో ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయిలో జరిగిన స్పెషల్ ఒలింపిక్ క్రీడల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ప్రతిభ చూపి రాణించడం అభినందనీయమని జేసీ కే.కార్తీక్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం క్రీడాకారులను జేసీ అభినందించి మాట్లాడారు. ఎస్.మనోజ్‌కుమార్ 100, 200 మీటర్ల పరుగుపందెంలో బంగారుపతకాలు, బీ.హేమంత్ కు మార్ 100 మీటర్ల పరుగు పందెం లో బంగారుపతకం, ఎన్.శరత్ కుమార్ వెండిపతకం, జీ.ఆదిశేషులోయర్ 100 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం, వీ.శరత్‌కుమార్ కాంస్య పతకం సాధించారని పేర్కొన్నారు. కృషి, పట్టుదల ఉంటే, వైకల్యం అవరోధం కాదని నిరూపించారని, ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, సీఎంవో పెంచలయ్య, ప్రత్యేక ఉపాధ్యాయులు రామచంద్రయ్య, జీసీడీవో మమత తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో రూ.13 లక్షలతో అభివృద్ధి పనులు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో కోరమండల్ సంస్థ సహకారంతో రూ.13లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి తెలిపారు. కళాశాలలో రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన రెండు వాటర్‌ప్లాంట్స్, రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన ఆక్వాపాప్ స్టార్టప్ లాబ్‌లను సోమవారం కోరమండల్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థ కడపజోన్ పరిధిలో డీకేడబ్ల్యూ కళాశాలను ఎంపిక చేసుకుని ఇక్క లెర్నింగ్ ఫౌండేషన్ ద్వారా మహిళలకు 30 రోజులు టైలరింగ్ శిక్షణను అందచేసిందన్నారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా మహిళలందరికీ ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో కోరమండల్ కడప జోనల్ హెచ్‌ఆర్ సౌజన్య, మార్కెటింగ్ హెడ్ డాక్టర్ టటీ.చక్రవర్తి, ఇక్క ఫౌండేషన్ డైరెక్టర్ కిషోర్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరంజని తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్, సిబ్బంది



గుడ్డ సంచుల పంపిణీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం వాకర్స్‌కు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి జీ.నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, జిల్లా ఎలక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, రామానాయుడు, సుబ్బారావు, కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం దేవుడెరుగు..

ఖర్చులు రూ.లక్షల్లో!

- టెన్త్ విద్యార్థుల స్నాక్స్ కోసం రూ. 45 లక్షలట !
- కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధం
- కాంట్రాక్టరు వెనుక ఓ ప్రజాప్రతినిధి హస్తం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 28,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ ఖజానాకు ఆదాయం మాట దేవుడెరుగు.... ఖర్చులు మాత్రం రూ. లక్షల్లో కనిపిస్తున్నాయి. కారణాలేవైనాసరే కాంట్రాక్టర్లు పోటీపడి నిధులు డ్రా చేసేస్తున్నారు. స్థానిక అధికారులు కూడా కళ్లు మూసుకుని తంతునడి పేస్తున్నారు. ఈ కోవకు చెందిందే పదో తరగతి విద్యార్థులకు పెట్టిన స్నాక్స్ బాగోతం. కార్పొరేషన్‌లో విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు, ఎస్ఎంసీ హైస్కూళ్లలో ఇటీవల పది పరీక్షలు రాసిన విద్యార్థుల పేరిట భారీ ఆర్థిక దోపిడీ జరిగినట్లు సమాచారం. తాజాగా ముగిసిన విద్యా సంవత్సరంలో పది విద్యార్థులకు స్నాక్స్, స్టడీ మెటీరియల్ అందించినందుకు ఏకంగా రూ. 24 లక్షలకు ఓ కాంట్రాక్టర్ బిల్లులు పెట్టారు. 16 హైస్కూళ్లలో 1,435 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థులున్నారు. వీరికి పరీక్షలకు ముందు నెలపాటు సాయంత్రం సమయంలో స్నాక్స్ అందించారు. రోజూ రెండు వడలు, బోండాలు, లేదా రెండు వడలు, రెండు బజ్జీలు చొప్పున అందచేశారు. ఈ లెక్కన రోజుకు రెండు వడలు, రెండు బోండాలు రూ. 10లు ఖర్చయినా, నెలకు ఒక్కొ క్క విద్యార్థికి రూ. 300లు అవుతుంది. 1435 మందికి రూ.4,30,500లు ఖర్చుగా లెక్కతేలింది. ఒక ప్యాడ్, జామెట్రీ బాక్స్, పెన్నుల బాక్స్ కలిపి రూ. 145లు ఖర్చవుతుంది. ఈ లెక్కన 1435 మందికి రూ. 2,08,075గా తేలింది. ఈ మొత్తం రూ. 6,38,575లు మాత్రమే అవుతుంది. కానీ రూ. 24 లక్షలు ఖర్చయినట్లు ఆ కాంట్రాక్టర్ బిల్లులను జత చేసి కార్పొరేషన్‌లో అధికారులకు సమర్పించారు. దీంతో వారు నిధులు మంజూరుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



ఇదే లెక్కన గత విద్యా సంవత్సరానికి రూ. 21 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కకట్టిన ఆ కాంట్రాక్టర్ ఆ మొత్తాన్ని కూడా మంజూరు చేయాలని తాజాగా బిల్లులు సమర్పించారు. మొత్తంమీద రూ. 45 లక్షలు ఖర్చుచేసి పది విద్యార్థులకు స్నాక్స్ అందించినట్లు చూపి, ఖజానా నుంచి డ్రా చేసేందుకు సదరు విభాగంలో వ్యవహారం నడుపుతున్నారు. కాగా కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో అధికారులు, కార్పొరేటర్లకు రూ. 7.22 లక్షలకు భోజనాలు పెట్టినట్లు లెక్కకట్టిన ఇదే కాంట్రా క్టర్ నిధులు డ్రాకు సిద్ధమయ్యాడు. ఈ కాంట్రాక్టర్ వెనుక కార్పొరేషన్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఉండ టంతో అధికారులంతా దర్యాప్తు లేకుండానే కళ్లు మూసుకుని సంతకాలు చేయడం గమనార్హం.

వినిపించని

దండోరా !

'గ్రామంలో యావన్మందికి తెలియచేయడమేమనగా రేపట్నుంచి మనూరి చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెర, కందిపప్పు, కిరసనాయిల్ అందుబాటులో ఉంటాయి. కావున రేషన్ కార్డులున్న వారంతా వచ్చి తీసుకెళ్లాలని మనూరి డీలర్ సుబ్బారావు తెలియచేశాడహో'...!

'అందరికీ ముఖ్యగమనిక... రేపు మనూరికి రెవెన్యూ అధికారులు వస్తున్నారు. ఎవరికైనా పొలాల సమస్యలు, పట్టాపుస్తకాల ఇబ్బంది లుంటే ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి అర్జీలు ఇచ్చుకోవచ్చని మనూరి వీఆర్వో శీనయ్య సారు తెలియచేశాడహో'.....

అంటూ గతంలో గ్రామాల్లో దండోరా వేసేవారు. అయితే మారిన సాంకేతి క పరిస్థితుల్లో నేడు దండోరా మాటలు వినపడటం లేదు.



- గ్రామాల్లో అంతరించిపోతున్న తప్పెట సంప్రదాయం
- సాంకేతిక విప్లవంతో మారుతున్న శతాబ్దాల సంస్కృతి
- భవిష్యత్ తరాలకు వినపడని 'తొలి కబురు'

నెల్లూరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్లగా దండోరాకు స్వస్తి పలికిన గ్రామ పాలకులు విప్లవంలా దూసుకెళ్తున్న సాంకేతికతో సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారు. గ్రామాల్లో తప్పెట ద్వారా దండోరా వేసి సదరు సమాచారాన్ని ప్రజలకు అధికారికంగా తెలియచేసేవారు. క్రమేణా ఈ సంప్రదాయానికి నూతనతరం స్వస్తి పలికింది. దీంతో భవిష్యత్ తరాలకు 'తొలి కబురు' వినపడకుండా చేస్తున్నారు. పది, పదిహేనేళ్ల క్రితం వరకు పంచాయతీలకు దండోరా వేసే వ్యక్తులు ప్రత్యేకంగా ఉండేవారు. గ్రామానికి అధికారులు వస్తున్నా, చౌకదుణాకాలకు రేషన్ వస్తువులు వచ్చినా, తుఫాన్, అంటువ్యాధులు వంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా, ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన వచ్చిన సందర్భాల్లో స్థానిక గ్రామ పంచాయతీలు తప్పెటేసి దండోరా ద్వారా అధికారికంగా ప్రజలకు తెలిపేవారు. మారుతున్న సాంకేతికతతో ప్రతీ చేతికి అందిన సెల్‌ఫోన్ల వ్యవస్థతో అందమైన పల్లె సంస్కృతులు అంతరించిపోతున్నాయి. అందులో దండోరా కూడా ఒకటి.

● దండోరానే ఇంటి పేరుగా...

పల్లెల్లో దండోరా వేసేవాళ్లకు అదే ఇంటిపేరుగా మారిపోయింది. ఈ క్రమంలో దండోరా వెంకయ్య, దండోరా శీనడు, దండోరా చిన్నోడు, దండోరా సూరిగాడు వంటి పేర్లతో గ్రామమంతా పిలిచేవారు. తప్పెట్ల ద్వారా వేసే దండోరా కళ అంతరించుకుపోవడంతో వాటిపై ఆధారపడిన కుటుంబాలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోతున్నారు. గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నుంచి ఏ సమాచారమైనా అధికారికంగా తెలియచేయాలంటే తొలత దండోరా ద్వారానే తెలపాలని సర్కారు తన ఆదేశాల్లో పేర్కొనేది. ఇప్పటికీ కొన్ని మారుమూల పల్లెల్లో అక్కడక్కడా దండోరా వినపడుతోంది.



దండోరా వేస్తేనే అధికారిక సమాచారం

ఆరోజుల్లో గ్రామంలో ప్రభుత్వ పరంగా ఏ సమాచారం తెలియచేయాలన్నా దండోరా వేసేవారు. అలా చెప్తేనే మా అందరికీ అధికారికంగా చెప్పినట్లు ఉండేది. తప్పెట ద్వారా దండోరా వేసే వ్యక్తులు రోడ్లపై వస్తే మేమంతా ఇంట్లో ఉండి శ్రద్ధగా వినేవాళ్లం.

- ఇనపకుతిక రాజగోపాలశర్మ, కలువాయి

అంతా ఫోన్లలోనే చూసుకుంటున్నాం

నేడు ఏ సమాచారమైనా సెల్‌ఫోన్‌లోనే చూసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సమాచారం వాట్సాప్‌లో వచ్చేస్తుంది. గ్రామ సమాచారం కూడా అందులోనే ఉంటుంది. దండోరా ద్వారా తెలుసుకుని వెళ్లేది చాలా తక్కువ.



- దండు సూర్య, సౌత్‌మోపూరు

కర్తం ప్రతాప్‌రెడ్డికి విశిష్ట సేవా పురస్కార్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అప్సా జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డికి ఉత్తమ అధ్యక్షుడిగా విశిష్ట సేవా పురస్కారాన్ని అందచేశారు. విజయవాడలో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ అవార్డును అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుందరం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మజ, పలువురు కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాకు చెందిన పలు పాఠశాలల కరస్పాండెంట్లు ప్రతాప్‌రెడ్డిని అభినందించారు.



ప్రతాప్‌రెడ్డికి అవార్డు అందచేస్తున్న అప్సా రాష్ట్ర నాయకులు

పట్టణాల్లో ట్రాఫిక్ మార్గాలు దాటుకుని జాతీయ రహదారి ఎక్కగానే ఎక్సలేటర్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు లేకపోవడంతో రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. పైగా ఆరు వరుసల జాతీయ రహదారి కావడంతో వేగానికి కళ్లెం వేయడంలేదు. ఇలాంటి



కంటైనర్ కింద ఇరుక్కున్న కారును కొంత దూరం వరకు లాక్కెళ్ళిన దృశ్యం

సంఘటనా స్థలం వద్ద ఐదుగురి మృతదేహాలు



విషాద యాత్ర

హరి హరులను దర్శించుకుని.. వెళుతుండగా ఘోర రోడ్డు ప్రమాదం

- పాకాల సమీపంలో కంటైనర్ కిందకు దూసుకెళ్లిన కారు
- ఐదుగురి దుర్మరణం, ఇద్దరికి తీవ్రగాయాలు

అతివేగం వల్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు.

- తిరుపతి/పాకాల, ఆంధ్రజ్యోతి




రుయా ఎమర్జెన్సీ నుంచి గీతమ్మను స్విమ్స్‌కు తరలిస్తున్న వైద్య సిబ్బంది, చికిత్స పొందుతున్న క్రిస్‌విల్

బెంగళూరుకు చెందిన నలుగురు మహిళలు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరులోని జీఆర్‌బీ ఫుడ్ ప్రొడక్ట్స్‌లో పనిచేస్తున్నారు. వీరు శనివారం తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. తిరుగుప్రయాణంలో పాకాల సమీపంలోని తోటపల్లి వద్ద జార్ఖండ్ రాష్ట్రం రాంచీనుంచి బెంగళూరుకు కొరియర్ లోడ్‌తో వెళ్తున్న కంటైనర్‌ను వెనుక వైపు బలంగా ఢీ కొన్నారు. దీంతో కారు కంటైనర్ కిందకు దూసుకెళ్లింది. ఏదో యాక్సిడెంట్ జరిగిందని గ్రహించిన లారీ డ్రైవర్ ఎన్‌హెచ్‌కు ఓ వైపున లారీ నిలిపారు. అప్పటికే సుమారు 80 మీటర్లు కంటైనర్ ప్రయాణం చేసింది. ఇంతలో స్థానికులు, అటువైపు వెళ్లేవారు అప్రమత్తమై పోలీసులకు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు.అప్పటికే ఘోరం జరిగిపోయింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ కింద చిక్కుకున్న కారు నుజ్జునుజ్జుగా మారింది. అతికష్టం మీద బయటకు తీశారు. ఈఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చనిపోయినవారి కొందరి ముఖాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. జాతీయ రహదారుల కోసం వినియోగించే క్రేన్ తీసుకొచ్చి అతికష్టం మీద కంటైనర్ నుంచి కారును వేరుచేశారు. గాయపడినవారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. బీతావహంగా మారిన ఘోర ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. కంటైనర్ డ్రైవరుతో మాట్లాడారు. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలుసుకున్నారు. కలెక్టర్ స్విమ్స్‌కు వెళ్లి క్షతగాత్రులకు వైద్య సేవలను పరిశీలించారు.

మృతులు బెంగళూరుకు చెందిన విజయలక్ష్మి (50), సహన (34), రజని (27), లేఖన్ గౌడ (10), తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన కారు డ్రైవరు ఎస్.త్యాగరాజన్ (42). వీరిలో విజయలక్ష్మి, రజని, లేఖన గౌడ్ ఒకే కుటుంబానికి చెందిన వారు.

తీవ్రంగా గాయపడింది

గీతమ్మ (51), క్రిస్‌విల్ (15). వీరిలో క్రిస్‌విల్ తండ్రి త్యాగరాజన్ మృతిచెందారు.



కంటైనర్ డ్రైవర్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

రోడ్డు ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: పాకాల మండలం తోటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా రోడ్డుప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికిమెరుగైన వైద్యసేవలు అందించాలని రుయాస్పత్రి సిబ్బందికి సూచించారు.

ఐదుగురి మృతిపై డిప్యూటీ సీఎం ఆవేదన

పాకాల, ఆంధ్రజ్యోతి: పాకాల మండలం తోటపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందడంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు. తిరుమల దర్శనం చేసుకొని తిరుగు పయనమైన భక్తులు ప్రమాదానికి గురికావడం దురదృష్టకరమన్నారు.

కంటైనర్ కింద ఇరుక్కుపోయి..

చంద్రగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాంచీ నుంచి బెంగళూరుకు కంటైనర్ డ్రైవర్ వికాస్ మెహతా, మరో డ్రైవర్ అభిజిత్ శనివారం బయలుదేరారు. సోమవారం మధ్యాహ్నం చంద్రగిరి మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద భోజనం చేసి, 1.30 గంటల సమయంలో కొంతదూరం వెళ్లగానే వెనక పెద్ద శబ్దం రావడంతో కంటైనర్‌కు ఏదైనా ప్రమాదం జరిగిందేమో అని సుమారు 80 మీటర్లకుపైగా ముందుకెళ్లి రోడ్డు పక్కకు వాహనం ఆపారు. కిందకు దిగి చూడగా కంటైనర్ వెనుక కింద భాగంలో కారు ఇరుక్కుపోయి ఉంది.

గంట సమయం పట్టింది.



ప్రమాద స్థలానికి వెళ్లి చూస్తే కంటైనర్ కింద కారు ఇరుక్కుపోయి నుజ్జు నుజ్జు అయిఉంది. అప్పటికే క్రేన్ ద్వారా కారును బయటకు తీశారు. ఇద్దరికి ఊపిరి ఉండటంతో అతికష్టంపై బయటకు తీసి, ఆసుపత్రికి పంపించాము. ఆ ఇద్దర్ని తీయడానికే గంట పట్టింది.

- చంద్రశేఖర్‌రెడ్డి, తోటపల్లి

ఇంత ప్రమాదం ఎప్పుడూ చూడలేదు



ప్రమాదం జరగ్గానే పక్కనే మా ఊరి నుంచి వెంటనే వెళ్లా. కంటైనర్ కింద కారులో నుంచి ఇద్దరి అరుపులు వినిపించాయి. అందరితో కలిసి పోలీసులకు సాయం చేసి, మృతదేహాలను బయటకు తీశాం. ఇలాంటి ప్రమాదం ఎప్పుడూ చూడలేదు.

- కిరణ్, బయనపల్లి

డీసీసీబీ చైర్మన్‌గా మరోసారి అమాస

వైసీపీ హయాంలో వేధింపులు... గాలి భాను విజయానికి కృషి కారణం

డీసీసీబీ కోరిన పల్లినేనికి సీడీసీఎంఎస్‌తో న్యాయం



అమాస రాజశేఖర రెడ్డి

తిరుపతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార రంగ చరిత్రలో సుదీర్ఘకాలం డీసీసీబీ ఛైర్మన్‌గా పనిచేసిన అమాస రాజశేఖర రెడ్డిని మరోసారి ఆ పదవి వరించింది. ప్రభుత్వం సోమవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్ష పదవికి ఆయన పేరు చోటుచేసుకుంది.గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర వేధింపులు ఎదుర్కోవడం, గత ఎన్నికల్లో నగరి నుంచీ గాలి భానుప్రకాష్ విజయానికి కృషి చేయడం వంటివి ఆయనకు పదవి దక్కడానికి కారణాలయ్యాయి.

అమాస రాజశేఖర రెడ్డి 2006లో డీసీసీబీ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం జిల్లావ్యాప్తంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన తండ్రి అమాస గోపాల రెడ్డి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డికి సన్నిహితుడు కావడంతో పదవి దక్కింది. 2006 నుంచీ 2011 వరకూ ఐదేళ్ళ పాటు ఛైర్మన్‌గా కొనసాగిన అమాస తర్వాత అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మద్దతుతో రెండవ పర్యాయం కూడా ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2016 వరకూ కొనసాగారు. పదవీకాలం పూర్తయ్యేనాటికి టీడీపీ ప్రభుత్వం వున్నప్పటికీ ఆయనను తొలగించకుండా 2019 వరకూ కొనసాగించింది.2017 నవంబరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డితో పాటు అమాస కూడా టీడీపీలో చేరారు.2017-19 నడుమ డీసీసీబీ ఛైర్మన్ హోదాలో ఆయన కుప్పం పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు బ్యాంకు నిధులు విడుదల చేశారు.దీనిపై తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయనపై కేసు కూడా నమోదు చేయించింది. తర్వాత రాజకీయంగా చురుగ్గా లేకపోయినా గతేడాది ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయానికి తెర వెనుక పనిచేశారు. ఈ రెండు కారణాలతో టీడీపీ అధిష్ఠానం ఆయన పట్ల సానుకూల దృక్పథంతో వుంది. దానికి తోడు సహకార రంగంలోని రెండు కీలక పదవుల్లో డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి ఇవ్వాలని నిర్ణయించింది. నగరి,పలమనేరు,పీలేరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్,అమరనాథరెడ్డి, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అమాస పేరును సిఫారసు చేసినట్టు తెలిసింది. ఇవన్నీ అమాసకు కలిసిరావడంతో గతంలో 13 ఏళ్ళ పాటు కొనసాగిన డీసీసీబీ ఛైర్మన్ పదవిలో ఇపుడు మళ్ళీ నియమితులయ్యారు.

● సీడీసీఎంఎస్ ఛైర్మన్‌గా సుబ్రమణ్యం నాయుడు



డీసీసీబీ ఛైర్మన్ పదవి ఆశించిన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ పదవి దక్కింది.సుదీర్ఘకాలంగా టీడీపీలో కొనసాగుతున్న ఈయన పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి విజయానికి పని చేస్తున్నారు. గతంలో చంద్రగిరి మండలం ఐతేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. ఆయన సతీమణి పనపాకం సర్పంచుగా పనిచేశారు. గత ఆరేళ్ళుగా ఆయన చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన విజయానికి గట్టిగా కృషి చేశారన్న కారణంగా ఎమ్మెల్యే పులివర్తి నాని డీసీసీబీ పదవి ఇవ్వాలని కోరారు. అయితే సామాజిక సమీకరణల్లో భాగంగా డీసీసీబీని రెడ్డి సామాజికవర్గానికి కేటాయించామని చెప్పిన అధిష్ఠానం సీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవి ఖరారు చేసింది. డీసీసీబీ, సీడీసీఎంఎస్ ఛైర్మన్ పదవులు రెండూ కూడా తిరుపతి జిల్లా పరిధిలోని వారికే దక్కడం విశేషం.

ఏసీబీకి చిక్కిన శ్రీకాళహస్తి సర్వేయర్

● రూ.25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పురుషోత్తంరెడ్డి



సర్వేయర్ పురుషోత్తంరెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండల సర్వేయర్ పురుషోత్తంరెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కాడు. వ్యవసాయ భూమి కన్వర్షన్ కోసం రూ.25వేలను లంచంగా తీసుకుంటుండగా పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌శాఖలో ప్రొటోకాల్ అధికారిగా పదవీ విరమణ చేశారు. శ్రీకాళహస్తిలోని పానగల్ వద్ద ఆయన ప్రైవేటు కళాశాల నిర్వహిస్తున్నారు. పట్టణ శివార్లలోని విశాలాక్షి కాలనీ ఎదురుగా పానగల్ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.172లో 75సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. దీనిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు (ల్యాండ్ కన్వర్షన్ కోసం) సుమారు రూ.1.70లక్షలు ప్రభుత్వానికి చలానా కట్టారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి మండల సర్వేయర్ పురుషోత్తంరెడ్డి లంచం డిమాండు చేయగా.. చంద్రశేఖర్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి నుంచి సర్వేయర్ పురుషోత్తంరెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 వరకు తహసీల్దారు కార్యాలయంలో విచారించారు. తహసీల్దారు లక్ష్మీనారాయణను ఏసీబీ అధికారులు కార్యాలయానికి పిలిపించారు. అలాగే ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి కూడా తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. విచారణ అనంతరం సర్వేయర్ పురుషోత్తంరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆయన్ను నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి, సీఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లంచం కోసం తిప్పలు పెట్టారు



నేను 2000లో కొన్న 75సెంట్ల వ్యవసాయభూమి కన్వర్షన్ కోసం ఫిబ్రవరిలో దరఖాస్తు చేశా. తహసీల్దారు లక్ష్మీనారాయణను, డీటీ ప్రేమ్‌కుమార్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా పనికాలేదు. దీంతో రెండోసారి షిర్డీకి వెళ్లి సాయిబాబాకు మొక్కుకుని దరఖాస్తు చేసినట్లు అధికారులకు చెప్పా. అయితే సాయిబాబా నీ పని పూర్తి చేస్తాడంటూ తహసీల్దారు, డీటీ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. 72 ఏళ్ల వయసులో ఎన్నిసార్లు కార్యాలయానికి వచ్చినా కనీసం కూర్చోమని చెప్పిన పాపాన పోలేదు. సర్వేయర్ పురుషోత్తంరెడ్డి రూ.30వేలు లంచం ఇవ్వాలంటూ రెండు నెలలుగా తిప్పాడు. చివరకు బేరమాడితే రూ.25వేలకు వచ్చాడు. అవినీతిని ప్రోత్సహించడం ఇష్టంలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించా.

- కె.చంద్రశేఖర్‌రెడ్డి, బాధితుడు

ఆరిమేనిపాడు క్వారీ అనుమతి రద్దు

● మైనింగ్ షరతులు పాటించకపోవడంతో పీసీబీ నిర్ణయం

ఓజిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడులో క్వారీ అనుమతులను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) నిర్ణయం తీసుకుంది. తక్షణమే క్వారీని నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామానికి చెందిన కొండగుట్ట సర్వేనెంబరు 65లో 10.926 హెక్టార్ల భూమిని గతంలో క్వారీ కోసం విశాంత్ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌కు అధికారులు లీజు కింద మంజూరు చేశారు. లీజు అగ్రిమెంటు, పీసీబీ నిబంధనల షరతుల మేరకు గ్రావెల్ తరలించాలి. కానీ, నిర్వాహకులు షరతులను మీరినట్లు పీసీబీ అధికారులు నిర్ధారించి మైనింగ్ అనుమతులను రద్దు చేశారు.



గ్రావెల్ కోసం తీసిన గోతులు

తొలి నుంచీ గ్రామస్థుల పోరాటం

కొండగుట్టలో గ్రావెల్ క్వారీకి అధికారులు అనుమతి ఇవ్వడంతో ఆరిమేనిపాడు గ్రామస్థులు పోరాటం చేపట్టారు. క్వారీకి అనుమతిచ్చిన ప్రాంతం గ్రామంలోని పశువుల మేతకు, నీటి వనరులకు కేంద్రంగా ఉంది. దీంతో ఇక్కడనుంచి గ్రావెల్ తరలింపుతో తమకు సమస్య ఎదురవుతుందంటూ ఆందోళనకు దిగారు. 'మైనింగ్ శాఖ అనుమతులు రద్దు అయితేనే సమస్యకు పరిష్కారం. అంతవరకు క్వారీ ప్రాంతంలో ఎలాంటి ఆందోళనలు చేపట్టినా చట్టం అతిక్రమించిన వారవుతారు' అంటూ పోలీసులు గ్రామస్థులను హెచ్చరించారు. దీంతో గ్రామస్థులంతా కలిసి మైనింగ్, పీసీబీ అధికారులను ఆశ్రయించారు. ఇక్కడి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ అధికారులు ఆరిమేనుపాడు క్వారీ ప్రాంతాన్ని సందర్శించారు. క్వారీ అనుమతులు పొందిన యాజమాన్యం మైనింగ్, పీసీబీ నిబంధనలు, షరతులను అతిక్రమించినట్లు గుర్తించారు. ఈ మేరకు నివేదికలు ఇవ్వడంతో అనుమతులు రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గజదాడుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఏనుగుల విధ్వంసంపై డిప్యూటీ సీఎం సమీక్ష

మంగళం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడం, రైతులపై దాడులు చేస్తుండడంపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సోమవారం సమీక్షించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గజదాడులను అదుపులోకి తెచ్చేందుకు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. చిన్నగొట్టిగల్లులో మూడురోజుల క్రితం ఏనుగు ఒక కౌలు రైతును తొక్కి చంపివేయడం, పాకాల మండలం గానుగపెంటలో పంటలను ధ్వంసం చేయడం ప్రస్తావించిన ఆయన ఏనుగుల వల్ల ప్రజలకు, ప్రజల వల్ల ఏనుగులకు ఎలాంటి హాని కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఎలిఫెంట్ కారిడార్‌లో భాగంగా ఏనుగుల మందలు, ఒంటరి ఏనుగులు ఎటు వెళ్తున్నాయో ట్రాక్ చేయడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఎలిఫెంట్ ట్రాకర్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్పష్టంచేశారు.ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు. ఈ మేరకు తిరుపతి డీఎఫ్‌వో వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ భాకరాపేట, పనబాకం, తిరుపతి రేంజి, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్‌రేంజ్‌లలో పనిచేస్తుందని సీసీఎఫ్ సెల్వం తెలిపారు. సౌర విద్యుత్ ద్వారా పనిచేసే జీఎస్‌ఎం సిమ్ ఏనుగుల కదలికలను గుర్తించి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తుందన్నారు. గ్రామస్థులు ఏనుగుల గుంపు కనపడితే టోల్‌ఫ్రీ నెంబరు 18004255909, తిరుపతి డీఎఫ్‌వో 94408 10069, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో 94408 10070కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కరీమాబేగం సోమవారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండంగా తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన సెల్వకుమార్ మోహన్ రూ.30 వేల విలువ చేసే ఆరు కిలోల గంజాయి తీసుకెళ్తుండడంతో పట్టుకున్నామన్నారు.

30న నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 30వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను మే 15వ తేదీ నిర్వహించనున్నారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి విభాగంలో రాజన్న ఫౌండేషన్‌కు అవార్డు



న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకుంటున్న దృశ్యం

రేణిగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి విభాగంలో బెస్ట్ 3 స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇనిషియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డును రాజన్న ఫౌండేషన్ అందుకుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో రాజన్న ఫౌండేషన్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా సోమవారం న్యూఢిల్లీలోని హయత్ సెంట్రల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, ఎక్స్ జనరల్ రమేష్ సచిదేవ్ చేతులు మీదుగా అందుకున్నారు. అవార్డు రావడం పట్ల రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు, అమర రాజా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ హర్షం వ్యక్తం చేశారు.


సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,177

తలనీలాలు సమర్పించినవారు: 23,694








నగరానికి సప్తవర్ణాల గొడుగు

ప్రసవం ఒక వేదన.. జననం ఒక ఆనందం.. తల్లికైనా.. పుడమి తల్లికైనా! మబ్బులు ముసురుకున్నంత మాత్రాన సూర్యోదయం ఆగదు. పసుపుపచ్చని లేత రంగులు నారింజవర్ణంలోకి మారి.. రవి కిరణ స్పర్శతో ఎర్రబారి.. నీలిమబ్బుల గొడుగుపట్టి.. ఇదిగో ఇలా ఎగసి వచ్చే భానుడికి రాగరంజితమై స్వాగతం పలుకకా తప్పదు.

సోమవారం ఉదయం తిరుపతి నగరంలో కనిపించిన నింగి వర్ణ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ అందిస్తున్నారు.

అతివేగం.. నిద్రమత్తు

రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు


సోమవారం నాటి ప్రమాదంలో ధ్వంసమైన కారు

నిదానమే ప్రధానం వేగంకన్నా ప్రాణం మిన్న

జాతీయ రహదారి ఎక్కగానే ఈ సూక్తులను మరచిపోతున్నారు వాహన చోదకులు. టైమే లేదన్నట్లు.. వెంటనే వెళ్లిపోవాలన్నట్లు వాహనాలను పరుగు పెట్టిస్తున్నారు. మరో వైపు విశ్రాంతి లేక.. వాహనాన్ని నడిపే క్రమంలో అలసటతో పాటు కునుకుపాటు తప్పడంలేదు. అంతా బాగున్నంత వరకు ఇవన్నీ ఓకే.. కాకుంటే ప్రాణాలే పోతున్నాయి. ఎందరో వికలాంగులుగా మారుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గతేడాది మే 27న చంద్రగిరి మండలం ఎం.కొంగరపల్లి వద్ద అతి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పింది. కల్వర్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేటకు చెందిన ఆరుగురు మృతి చెందారు. సోమవారం నాటి ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇలా ఏడాది కాలంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై 26 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వీటిలో 32 మంది దుర్మరణం చెందారు. 11 మంది తీవ్రంగా గాయపడగా.. మరెందరికో స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదాలన్నింటిని పరిశీలించిన పోలీసులు.. అతివేగం, నిద్రమత్తే ఈ అనర్థాలకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా ఉన్నప్పుడే తరచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆరు వరుసలు రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఒక్కోవైపు మూడు వరసల రహదారి కావడం.. రోడ్డు బాగా వుండడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. సోమవారం నాటి ప్రమాదానికీ అతివేగమే కారణమని ప్రాథమిక సమాచారం. నెమ్మదిగా వెళుతున్న కంటైనర్‌ను వెనుకనుంచీ ఎంతో బలంగా ఢీకొడితే గానీ కిందకు కారు దూసుకుపోయే అవకాశం లేదని పోలీసులు అంటున్నారు.

విశ్రాంతిలేని ప్రయాణం

ఇక, తిరుమల, కాణిపాకం, శ్రీకాళహస్తి క్షేత్రాల సందర్శనకు దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఎక్కువ మంది సొంత.. అద్దె వాహనాల్లో బయలుదేరి తమ యాత్రను తక్కువ వ్యవధిలో ప్లాన్ చేసుకుంటారు. అలాంటప్పుడు సెల్ఫ్ డ్రైవింగ్ లేదా, డ్రైవర్లు కంటిన్యూగా ఎక్కువ దూరం వాహనాన్ని నడపడటంతో అలసట, నిద్రలేమి తలెత్తుతోంది. వేగంగా వచ్చే క్రమంలో కంటిమీద రెప్ప పడితే చాలు.. వాహనం అదుపు తప్పి ప్రమాదానికి కారణమవుతుంది. వేగంగా వెళ్లే సమయంలో జరిగే ప్రమాదాలతో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోంది. పరిమిత వేగం.. డ్రైవర్లకు విశ్రాంతి ఉండేలా యాత్ర ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

హైవే పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేస్తాం

ప్రమాదాలకు అతివేగం, నిద్రమత్తు కారణాలుగా తెలుస్తోంది. వీటిని అరికట్టేందుకు హైవే పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠరుస్తాం. స్పీడ్ మానిటరింగ్ ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారుల్లో రాత్రి, తెల్లవారు జామున వాహనాలను ఆపి తరచూ తనిఖీ చేస్తున్నాం. 'ప్లీజ్ రండి.. వాహనం ఆపండి. దయచేసి మంచినీళ్లతో ముఖం శుభ్రం చేసుకోండి. కాసేపు విశ్రాంతి తీసుకుని ప్రయాణించండి' అనే నినాదాలతో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తాం. తద్వారా కొంతవరకు రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి సాధ్యమవుతుంది.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సగం సమస్యలు రెవెన్యూవే

కలెక్టరేట్ చుట్టూ అర్జీదారుల ప్రదక్షిణలు ● పీజీఆర్ఎస్‌కు 285 వినతులు

తిరుపతి (కలెక్టరేట్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో వస్తున్న సమస్యల గురించి రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో వారం వారం ప్రజలు అర్జీలు చేతబట్టుకుని కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల్లో 80 శాతం భూ సమస్యలపైనే అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 285 మంది అర్జీదారులు వినతులు అందించారు. అందులో 145 రెవెన్యూ శాఖకే వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె



రెండేళ్లుగా సమస్యలు చెప్పుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ స్పందించకపోతే వచ్చే సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించుకున్నామని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీహెచ్‌వోలు ప్రవళిక, మోహన్, అపర్ణ, సౌమ్య, రేవతి, నళిని, షీబా పాల్గొన్నారు.

మా బడి మా ఊరిలోనే ఉండాలి


ఎమ్మెల్యే ఆదిమూలంతో మాట్లాడుతున్న ఇప్పతాంగల్ గ్రామస్తులు

'అయ్యా మాది నారాయణవనం మండలం, కళింమిట్ట పంచాయతీ, ఇప్పతాంగల్. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను పక్క గ్రామమైన డీకేపాళెం పాఠశాలకు వెళ్లాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఆ ఊరికి వెళ్లాలంటే శ్మశానం, చెరువులు, గుంతలు దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం వస్తే ఇబ్బందులు తప్పవు. అందుకే పిల్లలను అక్కడికి పంపించేది లేదు. మా బడి మా ఊరిలోనే ఉంచండి' అంటూ గ్రామానికి రమ్య, పూజ, మీనా తదితరులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అదే సమయంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి సమస్యను వివరించారు.

పింఛన్ కోసం రెండేళ్లుగా తిరుగుతున్నా..



'నా భర్త ఆటోడ్రైవర్. రెండేళ్ల క్రితం మరణించాడు. నేను దివ్యాంగురాలిని. ఒంటరిగా ఉంటున్నాను. జీవనోపాధి చాలా దుర్భరంగా ఉంది. పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి మహాప్రభు' అంటూ ఆటోనగర్‌కు చెందిన విజయలక్ష్మి అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమైంది.

హైస్కూల్ ఏర్పాటు చేయండి : తిరుపతి నగరంలోని 25వ డివిజన్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ నరసింహాచారి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించాడు. స్కూల్‌ను అప్‌డేట్ చేసి హైస్కూల్‌గా మార్చాలని అనేకమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

వేలిముద్రలు పడలేదని బియ్యం ఇవ్వడం లేదు



సార్! మాది దొరవారిసత్రం, ఏడింబాకం రాజుపాలెం గ్రామం. నా వయసు 50 ఏళ్లు. వేలిముద్రలు పడకపోవడం, చూపు లేకపోవడంతో ఏడు నెలలుగా రేషన్‌షాపులో బియ్యం ఇవ్వడం లేదు. వీఆర్వోను ఎన్నిసార్లు అడిగినా సమస్యను పరిష్కరించలేదు. మీరైనా కనికరించండి.

- రమణమ్మ, ఏడింబాకం రాజుపాళెం, డీవీసత్రం

పింఛను మంజూరు చేయండి

నా భర్తకు కిడ్నీ సమస్యతో డయాలసిస్ చేస్తున్నారు. నాకు పక్షవాతంతో శరీరం సహకరించడంలేదు. నడవడానికి కూడా వీలు కావడంలేదు. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. పింఛను కోసం తిరుగుతూనే ఉన్నా కనికరించడం లేదు. మీరైనా స్పందించండి.

- మునెమ్మ, దిగువ మల్లవరం, రేణిగుంట మండలం



రూ.2.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

ఏడుగురు స్మగ్లర్ల అరెస్టు


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి-పంగూరు మెయిన్ రోడ్డులోని దొమ్మరపాళెం వద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి, 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీ, కారును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. కాటూరు ఫారెస్టు బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున కారు, దాని వెనుక లారీ వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి కొద్ది దూరంలో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు చుట్టుముట్టి ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లారీని పరిశీలించగా 72 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాహనాలతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లలో నలుగురు తిరుపతి జిల్లా, ముగ్గురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం విలువ రూ.2.5 కోట్లు ఉంటుందని టాస్క్‌ఫోర్సు అధికారులు అంచనా వేశారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్ సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న మినీవ్యాన్ : టీడీపీ నేత మృతి

● మృతుడు గురుమూర్తిని అర కిలోమీటరు లాక్కెళ్లిన వ్యాన్



ప్రమాదానికి కారణమైన మినీవ్యాన్, గురుమూర్తి (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని ద్వారకాపురం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు ఎల్లు గురుమూర్తి (52) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన గురుమూర్తి, అదే గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి మోటరు సైకిల్‌పై ఆదివారం రాత్రి నాయుడుపేట నుంచి స్వగ్రామమైన అత్తివరానికి బయలుదేరారు. ద్వారకాపురం వద్ద వీరు ప్రయాణిస్తున్న మోటరు సైకిల్‌ను వెనుక నుంచి మినీవ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు సైకిల్ నడుపుతున్న అనిల్‌రెడ్డి కింద పడిపోగా, వెనుక కూర్చొని వున్న గురుమూర్తి మినీ వ్యాన్‌కు తగులుకోవడంతో అర కిలోమీటరు వరకు లాక్కొని వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన గురుమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలపాలైన అనిల్‌రెడ్డిని 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గురుమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి కారణమైన మినీవ్యాను డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో వ్యక్తి పరారయ్యారు.

ప్రమాదం తీరు పట్ల అనుమానాలు

గురుమూర్తి స్వగ్రామమైన అత్తివరంలో 20రోజుల కిందట ఆయన సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాను రెండు రోజుల కిందట అత్తివరంలోనే ఉండటం, ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్‌తో పాటు మినీవ్యానులో ఉన్న మరో వ్యక్తి పరారవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు గురుమూర్తి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అదే గ్రామానికి మరి కొంతమంది ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైసీపీలో నుంచి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య వివాదాలు మరింత ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో గురుమూర్తి మృతి పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు

నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం ముగిశాక గురుమూర్తి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం అత్తివరం గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరు పట్ల అనుమానాలు ఉండడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు


ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సీఐలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 102 మంది ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది సీఐలను నియమించి కౌంటర్లు ఏర్పాటుచేశారు. ఆయా సీఐల వద్దకు వెళ్ళిన ఫిర్యాదులను పరిశీలించి అదనపు ఎస్పీల వద్దకు పంపుతారు. అక్కడినుంచి నేరుగా ఎస్పీ వద్దకు పంపి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. మరికొన్నింటిని డీఎస్పీలు, సీఐలకు పంపి పరిష్కరించాలని ఆదేశాలు జారీచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐలు సాదిక్ ఆలీ, జయచంద్ర, శ్రీరాములు, ఇమ్రాన్ భాష, రమణ, గోపి, హరిప్రసాద్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీడని ట్రాఫిక్ సమస్య



నిత్యం రద్దీగా ఉండే వెల్‌కమ్ సెంటరు రోడ్డు

నాయుడుపేట, ఏప్రిల్ 28: నాయుడుపేటలో ట్రాఫిక్ సమస్య వీడనంటోంది. నానాటికి పెరుగుతున్న పట్టణ జనాభా, తదనుగుణంగా అధికమవుతున్న వాహనాలు, ఆక్రమణలతో కుచించుకుపోతున్న రోడ్లు.. ట్రాఫిక్ సమస్యను జఠిలం చేస్తున్నాయి. గతంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి వెల్‌కమ్ సెంటరు వరకు ఆక్రమణలను తొలగించి డివైడర్లను ఏర్పాటు చేశారు. వెల్‌కమ్ సెంటరు నుంచి గాంధీ మందిరం వరకు ఆక్రమణలను తొలగించకపోడంతో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో పోలీసులు అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ మందిరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాక్టర్లు, ఇసుక బండ్లు, లారీలు వంటి వాహనాల రాకపోకలను నియంత్రించారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉండేదికాదు. ప్రస్తుతం పట్టణంలో ఎక్కడా నిబంధనలు అమలు చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గతంలోలా నిబంధనలు విధించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో మే 2వ తేదీన ప్రధానమంత్రి మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లా చీరాల పట్టణంలోని సదాశివం కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా విస్మరించిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు అమరావతి రాజధానిని అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారని, ఇందుకు శంకుస్థాపన చేయడానికి ప్రధాని మోదీని ఆహ్వానించడం జరిగిందన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష



ఆర్టీసీ డిపో వద్ద దీక్ష చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేయాలని, నైట్‌అవుట్ అలవెన్స్‌లను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని, మహిళా కండక్టర్లకు అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఇక గ్యారేజీలో సమస్యలను పరిష్కరించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో మోహన్, శ్రావణ్, ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూఏ డిపో సెక్రటరీ కేవీ.రత్నం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద రెండు రోజులు పాటు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు అక్రమ సస్పెన్షన్, రిమూవల్స్ నిలుపుదల చేసి ఉద్యోగ భద్రత కల్పించడచాలన్నారు. అన్ని కేటగిరిల్లో పదోన్నతులు ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రిటైర్డు ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నైట్‌అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400 పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీ.బాషా, ఎం.బాషా, ఇంతియాజ్, కృష్ణ, స్వామి, నరసయ్య, పెంచలయ్య, రెడ్డి, కృష్ణ బ్లాక్ స్మిత్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



లక్ష్మక్క కండ్రిగలో ర్యాలీ చేస్తున్న రైతులు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీ లక్ష్మక్క కండ్రిగలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం వల్ల ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ శ్రీనివాసులు, సహాయ వ్యవసాయాధికారి దినేష్, భాగ్యలక్ష్మి, పద్మమ్మ, భాగ్యమ్మ వివరించారు. సేంద్రీయ ఎరువుల వల్ల ఉపయోగాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో అధిక లాభాలు గడించి ఉత్తమ రైతులుగా ఎన్నికైన నలుగురిని శాలువాలు, జ్ఞాపికలతో అభినందించారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి సేవారత్న అవార్డు



కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న మ్యూజికల్, ఆల్‌దిబెస్ట్ అకాడమీ ప్రతినిధులు

వాకాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపాళెం గ్రామ ఉప సర్పంచు మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మ్యూజికల్, ఆల్ ది బెస్ట్ అకాడమీ సంయుక్తంగా సేవారత్న పురస్కారం అందజేశాయి. సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ చెన్నకేశవ అన్నారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో పాతనేరస్థుల నుంచి వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీవో సరెండర్‌కు సిఫార్సు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట మండల ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏపీవో) పూర్ణిమను తిరుపతి డ్వామా కార్యాలయానికి సరెండర్ చేసుకోవాలని కోరుతూ ఎంపీడీవో గోపి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్‌కు సోమవారం మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఏపీవో పూర్ణిమ గత కొద్ది రోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అంతేకాకుండా ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక బహిరంగ తనిఖీ సందర్భంగా ఉపాధి పనుల్లో అవకతవకలు బయటపడడంతో డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. అలాగే ఏపీవో పూర్ణిమ నుంచి రికవరీ చేశారు.

కొర్లగుంట గిరిజన కాలనీలో తాగునీటి ఇక్కట్లు





నీరు రాని కొళాయి - కంపచెట్ల చాటున నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

దొరవారిసత్రం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నేలపట్టు పంచాయతీలోని కొర్లగుంట గిరిజన కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముచ్చలగుంట నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా కొర్లగుంట గిరిజన కాలనీకి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే నెల రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. దీంతో సమీపంలోని తెలుగుగంగ కాలువలోని నీటిని వాడుకొంటున్నారు. అలాగే కొర్లగుంట గిరిజన కాలనీకి నేలపట్టు పక్షుల కేంద్రం నిధులతో గతంలో మంచి నీటి పథకం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నిర్మించిన ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి కొర్లగుంట గిరిజన కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్‌గా గంగోటి నాగేశ్వరరావు



డక్కిలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్‌గా డక్కిలి మండలం పలుగోడు గ్రామానికి చెందిన టీడీపీ నేత గంగోటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. వ్యాపారరీత్యా చెన్నైలో స్థిరపడ్డ నాగేశ్వరరావు రెండు దశాబ్దాలుగా వెంకటగిరి నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2009లో వెంకటగిరి అసెంబ్లీ టికెట్ ఆశించినా టీడీపీ అధిష్ఠానం కురుగొండ్ల రామకృష్ణకు కేటాయించింది. 2024లో తనకు టికెట్ ఇవ్వాలని నాగేశ్వరరావు పట్టు బట్టినా మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల యాదవ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో గంగోటికి నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ అధిష్ఠానానికి ప్రతిపాదించడంతో ఎట్టకేలకు నాగేశ్వరరావును ఆ పదవి వరించింది. కాగా, తనకు నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. గంగోటికి నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ పదవి దక్కడంతో ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నోటిఫికేషన్ ఇచ్చిన భూములనూ రిజిస్ట్రేషన్ చేశారు!



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్యవేడులో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు మాట్లాడుతూ సత్యవేడు మండం రాళ్లకుప్పంలో నోటిఫికేషన్ ఇచ్చిన భూములను గుట్టుచప్పుడు కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అదే పేదలు 5 సెంట్లు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే సవాలక్ష ప్రశ్నలు వేసి మెలికపెట్టే అధికారులు నిబంధనలను అతిక్రమించి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. నిబంధలనకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన భూములను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్జున్ గురుమూర్తి, భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, చిరంజీవి, వేల్‌రెడ్డి, వెంకటాచలపతి, బద్దెపూడి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి



జపాన్ రాయబారికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి విచ్చేసిన జపాన్ రాయబారి బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. తొలిసారి శ్రీసిటీ సందర్శనే తొలి అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడకు రావడం తమకు గర్వంగా ఉందని రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, ప్రగతిని వారికి వివరిస్తూ దేశంలోనే జపాన్ పరిశ్రమలకు రెండో అతిపెద్ద పెట్టుబడి కేంద్రంగా శ్రీసిటీ ఆవిర్భవించిందని తెలిపారు. శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన పలు అంశాలపై జపాన్ రాయబారి ఒనో కెయిచి చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలకపాత్ర వహించడంతో పాటు ఇండో - జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చురుకైన పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీలోని వివిధ జపాన్ పరిశ్రమలకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి చేసిన జపాన్ పరిశ్రమల ప్రతినిధులు, పలు అభిప్రాయాలను, సూచనలను రాయబారితో పంచుకున్నారు. అనంతరం డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు.

లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్యాణ్

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి కల్యాణ్ అన్నారు. సోమవారం స్థానిక మినర్వా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో తాము సాధించాల్సిన లక్ష్యాలను ముందుగానే నిర్ధేశించుకుని వాటికి అనుగుణంగా ఇంటర్మీడియట్‌లో కోర్సులను తీసుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు తాము సాధించాల్సిన విజయాలను చేరుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాము, రమణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ చేపడుతున్న నేత్రదాన కార్యక్రమం 462కి చేరింది. సూళ్లూరుపేట పట్టణం బాపూజీ కాలనీకి చెందిన మన్నెం తులశమ్మ (74) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యులు అంగీకారంతో నేత్రాలను చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం పాల్గొన్నారు.

వాకాడులో చోరీ

వాకాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం వాకాడు అశోక్ పిల్లర్ వద్ద దుకాణంలో చోరీ చేసిన ఘటన మరువక ముందే చాకలి వీధిలో మరో చోరీ జరిగింది. ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... బాధితురాలు దువ్వూరు నరసనమ్మ ఇంటికి తాళాలు వేసి శ్రీకాళహస్తిలోని తమ్ముడు వద్దకు వెళ్లింది. దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ. 60వేలు, రెండు సవర్ల బంగారు వస్తువులు, 250 గ్రాములు వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

చిల్లకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో స్థానిక యువత ఆధ్వర్యంలో మత్స్యకారుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్‌యాదవ్, అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేరంజన్, మత్స్యకార నాయకుడు వెంకయ్య ప్రారంభించారు. సతీష్ యాదవ్ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారుల్లో దాగి వున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు దోహద పడుతాయన్నారు.

ముందుగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ముందస్తుగా పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీని ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే పాత బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 30వ తేదీ లోగా బకాయిలను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు.

వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వెంకన్నపాళెం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని పొన్నూరు శీనయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... తిన్నెలపూడిలోని నారుమిట్ట కాలనీకి చెందిన శీనయ్య కోట నుంచి బైక్‌పై ఇంటికి వెళుతుండగా వెంకన్నపాళెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తలకు తీవ్ర గాయమైన శీనయ్యను 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పోలేరమ్మ జాతరకు విరాళం



నెలవల సుబ్రహ్మణ్యంకు నగదు అందజేస్తున్న శివ ప్రదీప్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని గ్రామదేవత పోలేరమ్మ జాతరకు పగడాల శివ ప్రదీప్ శివ ప్రదీప్ రూ.50116 విరాళంగా అందజేశారు. సోమవారం రాత్రి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి నగదు అందజేశారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానాబాల సుబ్బారావు, ధనుంజయ, గోపి, శ్యామ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, షైలాడి రాజశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోట దళితవాడకు చెందిన అరుణజ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం చెన్నైకు చెందిన నాగలాపురం గిరిధర్‌రెడ్డి రూ.10వేలు వితరణ చేశారు. ఆ చెక్కును స్థానిక షిరిడి సాయి అక్షయసేవా సమితి కన్వీనర్ అల్లం రమణయ్య అరుణజ్యోతి తండ్రి వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

డక్కిలి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. డక్కిలి సర్వే నెంబరు 258లోని ప్రభుత్వ భూమి ఆక్రమణ నేపథ్యంలో సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలను విస్తరింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు విస్తరింపజేయాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వీవోఏలు, సంఘబంధ అధ్యక్షురాళ్ల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనీల మాట్లాడుతూ మండలంలోని పలు సంఘబంధాల పరిధిలో ఉన్న పొదుపు సంఘాలు రుణాల రికవరీలో వెనుకబడి ఉన్నాయన్నారు. వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీసీలు ప్రసాద్, భాస్కర్, శంకర్, అలివేలమ్మ, శ్రీకాంత్, బిందు తదితరులు పాల్గొన్నారు.

కోట బార్ అసోసియేషన్ ఎన్నిక



బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

కోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో సోమవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడుగా అత్తికాయల మోహన్, జనరల్ సెక్రటరీగా పీవీ రమణ, కోశాధికారిగా ఆర్.కాటయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎంజసూర్య, పిజసాగర్, సెక్రటరీగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కమిటీని న్యాయమూర్తి భరత్ కమల్ అభినందించారు. ఎన్నికల అధికారిగా రామచంద్రరావు వ్యవహరించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, ఎస్‌పీఆర్డీ అధ్యక్షురాలు శాంతకుమారి, ఉపాధ్యాయుడు ఉస్మాన్ భాషా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట భవిత కేంద్రంలోని విద్యార్థులు డి.హారిక, పి.శ్రీనివాసులు, డి.మునిశేఖర్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరచడంతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎస్‌పీఆర్డీ అధ్యక్షురాలు శాంతకుమారి, ఉపాధ్యాయుడు ఉస్మాన్ భాషా సహకారంతో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు బహుమతులు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు భార్గవి, కుమారి, కనకమ్మ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం

పెళ్లకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడం సీఎం చంద్రబాబునాయుడుకే సాధ్యమైందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిలో ఎన్నో ఒడుదిడుకులు ఎదుర్కొంటూ సూపర్ సిక్స్ పథకాలను ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని రామాపురం వైద్యాధికారిణి జయశ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేనాడు పంచాయతీ మూల గ్రామంలో లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో కొందరు జ్వరపీడితులు ఉండడంతో వారినుంచి రక్తనమూనాలను సేకరించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజకుమారి, సిబ్బంది రమేష్, శివరంజనీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శంకర జయంతి వేడుకలు



వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్ణకమ్మ వీధిలోని జగద్గురు ఆది శంకరాచార్య మఠంలో సోమవారం నుంచి శంకర జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విభూతి, చందన, పుష్పాలంకరణ చేశారు. అవ్వారు శ్రీనివాసులు బృందం ఆధ్వర్యంలో నామసంకీర్తన నిర్వహించారు.